ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152
షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026
సంపుటి : 03 సంచిక : 189
శనివారం 18 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# అమెరికా దాడులు చేస్తోంది..
## తక్కువ విద్యుత్ వాడండి ఇరాన్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 17)
పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. అమెరికా- ఇరాన్ పరస్పర దాడులతో ఆ ప్రాంతం భగ్గుమంటోంది. తాజాగా ఇరాన్ చేసిన ప్రకటన అక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. తమ విద్యుత్ మౌలిక సదుపాయాలపె అమెరికా దాడులు చేసినట్లు ఇరాన్ ధ్రువీకరించింది. విద్యుత్ తక్కువగా వాడాలని దేశ పౌరులను కోరింది. ఈ మేరకు ఆ దేశ విద్యుత్ శాఖ వెల్లడించింది. ఇరుదేశాల మధ్య ఇటీవల మరోసారి ఉద్రిక్తతలు చెలరేగిన తర్వాత.. విద్యుత్ మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేసినట్లు ఇరాన్ అంగీకరించడం ఇదే తొలిసారి.ముఖ్యంగా దాడుల తీవ్రత అధికంగా ఉన్న దక్షిణ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వం కోరింది. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతోపాటు, విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నాయని, ప్రజలు వీలైనంత తక్కువ విద్యుత్ వినియోగించాలని కోరింది. అయితే, తమ విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేసిందా? సరఫరా లైన్లను ధ్వంసం చేసిందా? అనే దానిపై ఇరాన్ స్పష్టత ఇవ్వలేదు.
హర్మూజ్ జలసంధిపై నియంత్రణ కోసం ఇరాన్‌తోపాటు అమెరికా పోటీపడుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇదివరకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దానిని నిజం చేస్తూ తాజాగా అమెరికా దళాలు.. ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తున్నాయి.

# వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

తాను చెప్పే ఐదు మొక్కల పేర్లు చెప్పాలని లోకేశ్ కి సవాల్
పేర్లు చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
కూటమి ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపణ




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)
కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేశ్ పై మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదని ఆయన ఎద్దేవా చేశారు. అంతేకాదు తాను చూపించే ఏవైనా ఐదు వ్యవసాయ మొక్కల పేర్లను ఆయన సరిగ్గా చెబితే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ▶ 2లో

# జనసేన బలాబలాలను బట్టి పోటీ చేస్తాం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)
స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీపై మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం తెనాలిలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2024లో పొత్తు రాష్ట్ర ప్రయోజనాల కోసం పవన్ కల్యాణ్ తీసుకున్న నిర్ణయమని, అప్పటి పరిస్థితిని బట్టి ఒక అడుగు వెనక్కు తగ్గామని అధినేత చెప్పారన్నారు. అప్పుడు వర్తించిన ఫార్ములా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఉంటుందని వచ్చిన వార్తలు సరి కాదని మనోహర్ స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమి సమావేశంలో పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. స్థానిక పరిస్థితులు, పార్టీ బలాబలాలను బట్టి ▶ 2లో

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

గత పాలన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కేంద్రమే ఆదుకుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
నరసరావుపేటలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ
వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత
కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశామన్న సీఎం
2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతామని వెల్లడి




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)
గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు ▶ 2లో

# పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు.. ప్రారంభించిన మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 17)
భారత రైల్వే చరిత్రలో నూతన శకం ఆరంభమైంది. రైల్వే రంగంలో పర్యావరణహిత విధానాలను ప్రవేశపెట్టే దిశగా కీలక ముందడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలు.. శుక్రవారం పట్టాలెక్కింది. హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీన్ని జెండా ఊపి ప్రారంభించారు.ఈ హైడ్రోజన్ రైలు తొలుత ఉత్తర రైల్వే పరిధిలోని జింద్-సోనిపత్ సెక్షన్‌లో నడుస్తుంది. 89 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. మధ్యలో 12 స్టేషన్లలో ఆగుతుంది. 10 కోచ్‌లతో ఈ రైలును అందుబాటులోకి తెచ్చారు. ఇందులో 2600 మంది ప్రయాణించొచ్చు. త్వరలోనే కల్కా-శిమ్లా వంటి సాంస్కృతిక వారసత్వ రైల్వే లైన్‌లోనూ హైడ్రోజన్ ▶ 2లో

# మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి



నరసరావుపేటలో నిర్మలా సీతారామన్
నరసరావుపేటలో బ్యాంకుల రుణమేళా
వీధి వ్యాపారులకు ప్రభుత్వమే గ్యారెంటీగా నిలుస్తోందని స్పష్టీకరణ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 17)
ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నేతలు అధికారంలోకి వచ్చాక దేశంలో పరిస్థితులు పూర్తిగా ▶ 2లో


# కనెక్టివిటీ పెరిగితేనే ప్రగతి సాధ్యం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)
మంగళగిరి: దేశ సర్వతోముఖాభివృద్ధికి రైల్వేలు ఎంతో కీలకమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కనెక్టివిటీ పెరిగితేనే ప్రగతి సాధ్యమవుతుందని చెప్పారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద సరికొత్త హంగులతో మంగళగిరి రైల్వేస్టేషన్‌ను పునర్వ్యవస్థీకరించారు. రూ.12.56 కోట్ల భారీ వ్యయంతో ఆధునికీకరణ చేశారు. శుక్రవారం ఈ స్టేషన్‌ను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "దేశ ఆర్థిక, సామాజిక ప్రగతిలో ▶ 2లో



# భారత్‌పై ఫిర్యాదు.. ఖర్చు మొత్తం భరిస్తున్న పాక్..


సింధు జలాల వివాదంలో ట్విస్ట్
సింధు జలాల వివాదంపై అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్థను ఆశ్రయించిన పాక్
విచారణను బహిష్కరించిన భారత్
భారత ఖర్చులనూ చెల్లిస్తున్న పాక్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 17)
భారత్‌పై అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్థను ఆశ్రయించిన పాకిస్థాన్‌కు ఇప్పుడు అదే కేసు భారంగా మారింది. సింధు జలాల ఒప్పందానికి సంబంధించిన వివాదంలో భారత్ విచారణను బహిష్కరించడంతో, మధ్యవర్తిత్వ ప్రక్రియ ఆగిపోకుండా ఉండేందుకు పాకిస్థానే రెండు దేశాల ఖర్చును భరిస్తోంది. ఇప్పటివరకు ఈ ప్రక్రియ కోసం ఆరు లక్షల డాలర్లకు పైగా అంటే సుమారు రూ.5.2 కోట్లకు పైగా వెచ్చించినట్లు నివేదికలు వెల్లడించాయి. విచారణ కొనసాగుతున్న కొద్దీ ఈ భారం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నాయి.సింధు జలాల ఒప్పందం ప్రకారం వివాదాలు తలెత్తితే మధ్యవర్తిత్వ వ్యయాన్ని ▶ 2లో

# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!


త్వరలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రయోగానికి ఆర్బీఐ శ్రీకారం!




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)
దేశంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కసరత్తు చేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ పైలట్ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించి, 2027 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ▶ 2లో

# 70 ఏళ్ల చరిత్రలో గోదావరికి ఇంత తక్కువ ఇన్‌ఫ్లో ఇదే తొలిసారి

ధవళేశ్వరం నుంచి బైక్‌పై ప్రయాణించిన నిమ్మల
గోదావరి సెంట్రల్ డెల్టా కాలువల వెంబడి కొనసాగిన పర్యటన
నీటి ఎద్దడిని అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)
వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి నిర్వహణను పర్యవేక్షించేందుకు ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బైక్‌పై ప్రయాణించారు. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి కొత్తపేట, పి.గన్నవరం, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని గోదావరి సెంట్రల్ డెల్టా కాలువల వెంబడి ఆయన పర్యటన సాగింది. ఈ సందర్భంగా లాకుల నీటిమట్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తపేట నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి నల్ల లాకులను తనిఖీ చేశారు.
70 ఏళ్ల చరిత్రలో జులై నెలలో గోదావరి నదికి ఇంత తక్కువ ఇన్‌ఫ్లో రావడం ఇదే మొదటిసారని ఈ సందర్భంగా మంత్రి నిమ్మల పేర్కొన్నారు. 70 శాతం కాలువలు, 30 శాతం వర్షాలపై ఆధారపడి డిజైన్ చేసిన డెల్టాలో ప్రస్తుత పరిస్థితుల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా కాకినాడ రూరల్, ▶ 2లో



# అమ్మకానికి ట్రూత్ పోస్టులు.. ట్రంప్ చేతిలో ప్రతిదీ వ్యాపారమే..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 17)
ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసుకునే ప్రతి డీల్ వెనక బిజినెస్ కోణం ఉంటుందనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తుంటాయి. హోటల్స్, గోల్ఫ్ క్లబ్స్, క్రిప్టో కరెన్సీ ఇలా.. ప్రతి రంగంలోనూ ఆయన కుటుంబానికి వాటాలు ఉన్నాయి. సొంతంగా ట్రూత్ సోషల్ మీడియా ను నడుపుతున్నారు. అందులో ఆయన ▶ 2లో

# వైసీపీ ప్రభుత్వం చేసిందే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తోంది: షర్మిల

అమ్మఒడి ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ మోసం చేసిందన్న షర్మిల

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)
కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. "తల్లికి వందనానికి పంగనామం-బిడ్డలకు ఎగనామం" ఇదే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీ అంటూ ఆమె విమర్శించారు. అంతేకాదు గత ముఖ్యమంత్రి జగన్‌కి వారసుడు నేటి సీఎం చంద్రబాబు ▶ 2లో



# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (ఛీూూ) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

కాకాణి సవాల్ విసిరారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం దోపిడీయే పరమావధిగా పాలిస్తోందన్నారు.

జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరితే, ప్రస్తుతం చంద్రబాబు వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని కాకాణి దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో నిర్మించిన రామాయపట్నం పోర్టును ఈ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే ఇందుకు నిదర్శనమని కాకాణి విమర్శించారు. ఈ ప్రభుత్వంలో గ్రావెల్ తవ్వకాల నుంచి నిరుద్యోగుల డీఎస్సీ నోటిఫికేషన్ వరకు ప్రతి ఒక్క విషయంలోనూ అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ప్రతి పథకంలోనూ, ప్రభుత్వ నిర్ణయంలోనూ పారదర్శకత లోపించిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వ్యవసాయ రంగం, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై కాకాణి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి.

## జనసేన బలాబలాలను బట్టి పోటీ చేస్తాం

ఎవరికి ఎన్ని అనేది నిర్ణయం ఉంటుందని వివరించారు. కూటమి బలోపేతమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జనసేనలో కష్టపడి పనిచేసే వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామన్నారు.

# పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు.. ప్రారంభించిన మోదీ

పరిజ్ఞానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్ రైళ్లు.. పైన ఉండే కరెంటు తీగల నుంచి విద్యుత్‌ను తీసుకుంటాయి. ఇక, సంప్రదాయ డీజిల్ రైలు ఇంజిన్లు ఇంధనాన్ని మండించి యాంత్రిక శక్తిని ఉత్పత్తి చేస్తాయి. హైడ్రోజన్ రైలు సొంతంగా కరెంట్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. దీని కోసం రైల్లో 'ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్' అనే చిన్నపాటి పవర్‌ప్లాంట్ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైళ్లు ఇంకా ఆరంభ దశలోనే ఉన్నాయి. తొలిసారిగా జర్మనీ దీన్ని ప్రవేశపెట్టింది. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు ప్రయోగాత్మకంగా నడపడమో లేక పరిమితంగా వినియోగంలోకి తీసుకురావడమో చేస్తున్నాయి.

రైలు ఫీచర్లు ఇవే..

1,200 కిలోవాట్ల సామర్థ్యం ఉండే ఫ్యూయెల్ సెల్‌లో హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య జరుగుతుంది. తద్వారా విద్యుత్ ఉత్పత్తవుతుంది. హైడ్రోజన్‌ను ట్యాంకుల రూపంలో రైలు మోసుకెళుతుంది. ఆక్సిజన్‌ను పరిసరాల్లోని గాలి నుంచి సేకరిస్తుంది.

ఇలా ఉత్పత్తయిన విద్యుత్.. రైలులోని ట్రాక్షన్ మోటార్లకు శక్తిని అందిస్తుంది. అవి చక్రాలను నడుపుతాయి. దీని ప్రొపల్షన్ వ్యవస్థ సామర్థ్యం 3,200 హెచ్‌పీ. దీంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్న శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా ఇది నిలిచింది. ఇది గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఇది శుద్ధ ఇంధన పరిజ్ఞానం. ఈ ప్రక్రియలో నీటి ఆవిరి, వేడి మాత్రమే ఉప ఉత్పత్తులుగా వెలువడతాయి. ఇందులో దహనచర్య జరగదు. అందువల్ల హానికారక పొగ, కర్బనఉద్గారాలు వెలువడవు. ధ్వని కూడా తక్కువే. రైల్లోని నాన్‌స్టాప్ వెంటిలేషన్ వ్యవస్థ.. గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూస్తుంది. అందువల్ల ఏదైనా లీకేజీ తలెత్తినా అది గాల్లోకి వెళ్లి, పలుచబడిపోతుంది. ప్రమాదాన్ని గుర్తిస్తే.. ఆటోమేటిక్ షట్‌ఆఫ్ వ్యవస్థ తనంతట తాను హైడ్రోజన్ సరఫరాను నిలిపివేస్తుంది. ఈ రైల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు ఉన్నాయి. అవి హైడ్రోజన్ లీకేజీలు, వేడి, మంటలు, పొగ వంటి ముప్పులపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతాయి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సెకన్లలోనే అప్రమత్తం చేస్తాయి. భద్రతకు ప్రాధాన్యమిస్తూ లోకోపైలట్ క్యాబిన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు.

## మొదటి పేజీ తరువాయి

లోకో పైలట్ ఎదుట ఉండే ఒక స్క్రీన్.. అన్ని అంశాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది.

# మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి

మారాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గతంలో ఫోన్ బ్యాంకింగ్ ద్వారా ఎవరికి రుణాలు ఇవ్వాలో నిర్దేశించే వారని, కానీ ఇప్పుడు బ్యాంకులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అర్హులైన వారికి అండగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన 'క్రెడిట్ అవుట్‌రీచ్' కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, బ్యాంకులు ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందించాలన్నది ప్రధాని మోదీ ఆలోచన అని తెలిపారు. 2004 నుంచి 2014 మధ్య కేంద్రంలో ఉన్న ప్రభుత్వం, ఫోన్ కాల్స్ ద్వారా తమకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించుకునేదని, కానీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ఆ విధానానికి స్వస్తి పలికిందని విమర్శించారు. ప్రస్తుతం గ్రామగ్రామాన బ్యాంకులు పర్యటించి, ఎలాంటి హామీ లేకుండా అర్హత ఉన్నవారికి రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. వీధి వ్యాపారులకు సైతం ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి వారి వ్యాపారాలకు చేయూతనిస్తోందని వివరించారు. అధిక వడ్డీలకు అప్పులిచ్చే వ్యాపారుల బారిన పడకుండా మైక్రో ఫైనాన్స్ ద్వారా మహిళలు, చిరు వ్యాపారులను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు.దేశవ్యాప్తంగా బ్యాంకులు తమ పనితీరును, ప్రజలు బ్యాంకుల పట్ల తమ దృక్పథాన్ని మార్చుకున్నారని, నరసరావుపేటలో జరిగిన ఈ రుణమేళానే దానికి నిదర్శనమని అన్నారు. వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కోట్లాది రూపాయల రుణాన్ని బ్యాంకులు అందించాయని తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అగ్రగామి అభివృద్ధి చెందిన దేశంగా, 'వికసిత్ భారత్'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆమె పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో భాగంగా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన అంబులెన్స్‌లను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసి, వివిధ రంగాలకు చెందిన లబ్ధిదారులకు రుణాలను వితరణ చేశారు.

## కనెక్టివిటీ పెరిగితేనే ప్రగతి సాధ్యం

రైల్వేశాఖ కీలకపాత్ర పోషిస్తోంది. దేశాన్ని ఏకం చేసే ఏకైక అతిపెద్ద సంస్థ రైల్వే మాత్రమే. గతంలో రైల్వే వ్యవస్థలో తీవ్ర ఆలస్యాలు, భద్రతా లోపాలు ఉండేవి. కానీ నేడు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో 'కవచ్' ఆటోమేటిక్ ప్రొటెక్షన్ వంటి అత్యాధునిక సిస్టమ్స్‌తో దేశంలో అపూర్వమైన రైల్వే విప్లవం నడుస్తోంది. మంగళగిరి నియోజకవర్గానికి రైల్వే పరంగా మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. ఇక్కడ మరిన్ని రైళ్లు ఆగేలా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ చూపాలని కోరుతున్నా. మంగళగిరిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక పథకం తీసుకురావాల్సిన అవసరముంది. ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే కలిసికట్టుగా పనిచేస్తే నియోజకవర్గ అభివృద్ధి ఎలా ఉంటుందో చూపించడానికి నేడు మంగళగిరి ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలిచింది. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు చూడాలని సీఎం చంద్రబాబే స్వయంగా కుప్పం నేతలకు చెప్పారు. రాజధాని అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. దీనికోసం రైల్వే, రోడ్డు, ఎయిర్ లైన్ రవాణా వ్యవస్థల అనుసంధానం ఎంతో అవసరం. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా, సాంకేతికంగా వేగంగా అభివృద్ధి చేస్తున్నాం. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాల వైపు చూడాల్సిన అవసరం లేకుండా చేస్తాం" అని లోకేశ్ అన్నారు.

## భారత్‌పై ఫిర్యాదు.. ఖర్చు మొత్తం భరిస్తున్న పాక్..

భారత్, పాకిస్థాన్ సమానంగా భరించాలి. అయితే 2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉగ్రవాదానికి పాకిస్థాన్ పూర్తిగా చెక్ పెట్టే వరకు సింధు జలాల ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అదే సమయంలో ఈ వివాదానికి సంబంధించిన మధ్యవర్తిత్వ ప్రక్రియ నుంచి కూడా తప్పుకొంది.కిషన్‌గంగా, రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టులపై పాకిస్థాన్ పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించింది. ఈ ప్రాజెక్టుల రూపకల్పన ఒప్పందానికి విరుద్ధమని ఇస్లామాబాద్ వాదిస్తోంది. కానీ ఇది సాంకేతిక అంశమని, ఇలాంటి వివాదాలను కోర్టు కాకుండా తటస్థ నిపుణుడే పరిశీలించాలని భారత్ మొదటి నుంచీ చెబుతోంది. రెండు వ్యవస్థలు ఒకేసారి నడవడం ఒప్పంద నిబంధనలకు విరుద్ధమని కూడా స్పష్టం చేసింది.

అంతర్జాతీయ మధ్యవర్తిత్వ నిబంధనల ప్రకారం ఒక పక్షం హాజరు కాకపోయినా ట్రైబ్యునల్‌కు అధికార పరిధి ఉందని భావిస్తే విచారణ కొనసాగించవచ్చు. అదే కారణంతో 'పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్' పాకిస్థాన్ పిటిషన్‌పై విచారణ కొనసాగిస్తోంది. అయితే ఈ ట్రైబ్యునల్ చట్టబద్ధంగా ఏర్పడలేదని భారత్ చెబుతోంది. అందువల్ల ఆ కోర్టు ఇచ్చే ఎలాంటి తీర్పునూ తాము గుర్తించబోమని ఇప్పటికే స్పష్టం చేసింది.

భారత్ విచారణకు హాజరు కాకపోయినా కేసును కొనసాగించాలంటే మొత్తం ఖర్చును పాకిస్థానే భరించాల్సి వస్తోంది. అందుకే తన వాటాతో పాటు భారత్ చెల్లించాల్సిన మొత్తాన్నీ ఇస్లామాబాద్ చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రూ.5.2 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు సమాచారం. విచారణ ఇంకా కొనసాగితే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది.ఇప్పటికే పాకిస్థాన్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి 7 బిలియన్ డాలర్ల సహాయ ప్యాకేజీపై ఆధారపడుతోంది. పన్నుల పెంపు, సబ్సిడీల కోత, అప్పుల నియంత్రణ వంటి కఠిన షరతుల మధ్య ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఇలాంటి సమయంలో మధ్యవర్తిత్వ ఖర్చు కూడా పెరగడం పాకిస్థాన్‌పై అదనపు భారంగా మారింది.

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

తొలి దశలో భాగంగా రూ. 10, రూ. 20 వంటి తక్కువ ముఖ విలువ కలిగిన నోట్లతో ఈ ప్రయోగాన్ని ప్రారంభించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేయకుండానే, దశలవారీగా ఈ కొత్త పాలిమర్ నోట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన పాలిమర్ షీట్లను సరఫరా చేసేందుకు ఆర్బీఐ నోట్ల ముద్రణ విభాగం ఇప్పటికే గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) జారీ చేసింది. బిడ్ల దాఖలుకు ఆగస్టు 18ని తుది గడువుగా నిర్ణయించింది.

దేశంలో యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగినప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గలేదు. దీనికి తోడు పాత నోట్ల స్థానంలో కొత్త వాటిని ముద్రించడం వల్ల ముద్రణా వ్యయం భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కాటన్‌తో తయారు చేసే కాగితపు నోట్లకు బదులు, ప్లాస్టిక్ ఆధారిత పాలిమర్ నోట్లను తీసుకురావడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని ఆర్బీఐ భావిస్తోంది. ఈ నోట్లు ఎక్కువ కాలం మన్నడమే కాకుండా నీరు, మురికి వంటి వాటికి త్వరగా పాడవవు. ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, కెనడా వంటి దేశాల్లో ఇవి విజయవంతంగా చలామణిలో ఉన్నాయి.గతంలో 2012-14 మధ్య కాలంలోనే ఆర్బీఐ ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్ర బ్యాంక్, ఏటీఎంలలో వీటి అనుకూలత వంటి సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ పైలట్ ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అయితే, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## 70 ఏళ్ల చరిత్రలో గోదావరికి ఇంత తక్కువ ఇన్‌ఫ్లో ఇదే తొలిసారి

అమలాపురం, ముమ్మిడివరం శివారు ప్రాంతాల్లో ఉన్న నీటి ఎద్దడిని అధిగమించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఈ పర్యటన ద్వారా స్థానిక రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## అమ్మకానికి ట్రూత్ పోస్టులు.. ట్రంప్ చేతిలో ప్రతిదీ వ్యాపారమే..

పెట్టే పోస్టులతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు ప్రభావితమైన సందర్భాలున్నాయి. దానిని దృష్టిలో పెట్టుకొని ట్రంప్ మీడియా సంస్థ ఒక కొత్త సర్వీస్‌ను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. దానివల్ల మార్కెట్‌ను ప్రభావితం చేసే పోస్టు ప్రపంచం మొత్తానికి అందుబాటులోకి రావడానికి కొన్ని క్షణాల ముందు కొంత సొమ్ము చెల్లించిన పెట్టుబడిదారులు తెలుసుకోవడానికి వీలు ఉంటుంది.'ట్రూత్ పీఎస్ఐ' పేరిట ఈ ప్రీమియం సర్వీస్ తీసుకురావాలని ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ యోచిస్తోంది. ట్రూత్ సోషల్‌లోని కీలకమైన అకౌంట్ల నుంచి వచ్చే పోస్టులు విస్తృతంగా యూజర్లందరికీ అందుబాటులోకి రావడానికి కొన్ని మిల్లీ సెకన్ల ముందు డబ్బు చెల్లించే కస్టమర్లు చూసేందుకు వీలుకలగొచ్చని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మదుపర్లు, ట్రేడింగ్ సంస్థలే లక్ష్యంగా ఈ సేవలు తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో ఇవి అందుబాటులోకి తీసుకురావచ్చొని భావిస్తున్నారు. ప్రీమియం ఎంతో తెలియాల్సి ఉంది.ట్రంప్ స్వయంగా తీసుకువచ్చిన ఈ సోషల్ మీడియాలో అత్యధిక యూజర్లు ఉన్న ఖాతా ఆయనదే. ట్రంప్‌నకు 12.9 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్‌లో అతిపెద్ద వాటాదారు ట్రంపే. దాంతో ఈ ప్రీమియం సర్వీస్ వల్ల ఎక్కువగా లాభపడేది కూడా ఆయనే. ఈసారి ఆయన అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి టారిఫ్‌లు, ఇరాన్ యుద్ధం గురించి చేసిన పోస్టులతో అంతర్జాతీయ మార్కెట్లు ప్రభావితం కావడాన్ని ప్రపంచమంతా గమనించింది. మరోవైపు, మార్కెట్ నిర్ణయాలకు తగ్గట్టుగా కదలాడే క్రిప్టో కరెన్సీ కంపెనీల్లోనూ ట్రంప్ కుటుంబానికి వాటాలున్నాయి. ఇరాన్ యుద్ధం వేళ ట్రంప్, ఆయన కుటుంబం, సన్నిహితులు కొందరు ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేశారన్న ఆరోపణలూ వచ్చాయి. దీంతో ఈ ప్రీమియం సర్వీస్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## వైసీపీ ప్రభుత్వం చేసిందే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తోంది: షర్మిల

అంటూ ఆమె ఎద్దేవా చేశారు. గత వైసీపీ మోసాలను తు.చ తప్పకుండా పాటించడం కూటమి ప్రభుత్వ విధానమైందని మండిపడ్డారు.అమ్మఒడి పేరుతో ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ ప్రభుత్వం తల్లులను పచ్చిమోసం చేసిందని వ్యాఖ్యానించారు. "నీకు 15, నీకు 15, ఎంతమంది ఉంటే అన్ని 15 వేలు అని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు చంద్రబాబు తల్లులను నయవంచన చేస్తున్నారని షర్మిల ఆరోపించారు. కోతల రాయుడు కోతలంటూ జగన్ ను ఎద్దేవా చేసిన చంద్రబాబే మళ్లీ కోతలకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యారని విమర్శించారు.తల్లికి వందనంపై నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే 87 లక్షల మంది బిడ్డలకి ఇవ్వాలన్నారు. కోతలు పెట్టకుండా ప్రతి బిడ్డకు 15 వేలు జమ చేయాలన్నారు. కొర్రీలు పెట్టకుండా మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి పథకం కింద ఒక్కబిడ్డకే ఇచ్చి తల్లులను మోసం చేశారని... ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే మార్గం అనుసరిస్తోందని షర్మిల ఆరోపించారు. తల్లికి వందనం పథకం కేవలం ఎన్నికల ముందు ఇచ్చిన హామీగా మిగిలిపోయిందని విమర్శించారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థినులకు నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ


**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 17)**



గిద్దలూరు పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ ప్లస్ నందు చదువుతున్న 70 మంది విద్యార్థినీలకు ఇదే పాఠశాలలో పీజిటీలుగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్య, మొరసా బాల గురవయ్యలు తమ సొంత నిధులను నుంచి రూ.15 వేలు ఖర్చు చేసి 70 మంది విద్యార్థినులకు అవసరమైన నోటుబుక్స్, పెన్నులు తదితర స్టేషనరిని హై స్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ మాట్లాడుతూ విద్యార్థినిలకు జేఈఈ మెయిన్స్, నీట్‌కు సంబంధించిన ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. దాతలు డాక్టర్ మొర్రి పిచ్చయ్య, మైరసా బాల గురువయ్యలు మాట్లాడుతూ విద్యార్థినిలు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని లక్ష్యసాధన కోసం కష్టపడి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను చేరాలని మోటీవేషన్ స్పీచ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిజిటిల సిబ్బంది సగీర్, శ్రీరామిరెడ్డి, రాజేంద్రప్రసాద్, శోభారాణి, వెంకాయమ్మలు పాల్గొని దాతలు మొరసా బాలగురువయ్య, డాక్టర్ మొర్రి పిచ్చయ్యలను అభినందించగా, విద్యార్థినిలు ధన్యవాదాలు తెలిపారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్ యుగంధర్‌బాబు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)**




సాధారణ బదిలీలలో భాగంగా ప్రకాశం జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ యుగంధర్‌బాబు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ ఎస్పీకి జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లాలో కాపుల బలోపేతం దిశగా కాపునాడు కార్యచరణ

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)**




జిల్లాలో కాపుల బలోపేతం దిశగా కాపునాడు కార్యాచరణ చేపట్టినట్లు కాపు నేతలు అన్నారు. శుక్రవారం ఒంగోలులోని కాపునాడు కార్యాలయంలో ఒంగోలు పార్లమెంటరీ కాపునాడు అధ్యక్షులు పోగుల మల్లికార్జునరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షులు మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంటరీ పరిధిలో ఉన్న నియోజకవర్గ, మండల పరిధిలో ఉన్న కాపులను సమిష్టిగా బలోపేతం చేసే దిశగా కాపునాడు కార్యాచరణ చేస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గాలు, మండలాల కాపునాడు అధ్యక్షులును నియమిస్తున్నామని తెలియజేశారు. కనిగిరి నియోజకవర్గం కాపునాడు అధ్యక్షుడిగా మారెళ్ళ మల్లికార్జునరావు, కొమరోలు మండల కాపునాడు అధ్యక్షుడిగా అవిశినేని గురవయ్య, కొనకనమిట్ల కాపునాడు అధ్యక్షుడిగా చాతిరాశి నాగేశ్వరరావు, పొదిలి టౌన్ కార్యదర్శిగా పోలుదాసు శీను, పొదిలి టౌన్ కాపునాడు ఉపాధ్యక్షుడుగా సింగంశెట్టి శివ, అద్దంకి నియోజకవర్గ మహిళా కాపునాడు అధ్యక్షురాలుగా ధర్మవరపు ఆదిలక్ష్మి, ఒంగోలు నియోజకవర్గ కాపునాడు ఉపాధ్యక్షుడుగా పసుపులేటి రవితేజను నియమించడం జరిగింది. ఈ సమావేశంలో ఒంగోలు పార్లమెంటరీ జనరల్ సెక్రెటరీ దాసరి పిచ్చయ్య నాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కాపులందరూ అన్ని కులాల వారిని కలుపుకొని ముందుకు సాగిన నాడే రాజ్యాధికారం సాధించగలమని తెలియజేశారు. ఒంగోలు పార్లమెంటరీ కోశాధికారి జంగల్‌శెట్టి సుధాకర్, జాయింట్ సెక్రెటరీ గారా నారాయణ, మార్కాపురం జిల్లా కాపునాడు కన్వీనర్ వెలుగోలు కాశి విశ్వనాథ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు నక్కపోతే నిర్మల, తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

18.07.26    శనివారం




## హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాం**

**చెప్పిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశాం**

**వెలిగొండ పూర్తి కాకుండానే**

**జాతికి అంకితం చేసి జగన్ ప్రజలను మోసం చేశారు**

**త్వరలో వెలిగొండ నుంచి నీళ్లు అందిస్తాం**

**మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జులై 17)**

హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం త్రిపురాంతకంలోని శ్రీ బాలత్రిపుర సుందరిదేవి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యతో కలిసి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆలయ కమిటీ సభ్యుల చేత మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వైసీపీ హయాంలో హిందూ దేవాలయాల్ని నిర్లక్ష్యం చేశారన్నారు. కాసుల కక్కుర్తితో తిరుపతి వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని సైతం కల్తీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించామని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తామన్నారు. గత ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారన్నారు. ▶ 4లో

## పిజిఆర్ఎస్‌లో వచ్చే ప్రతి సమస్య పరిష్కరించడమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 17)**




ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి జిల్లా కలెక్టర్ పి రాజబాబు వలేటివారిపాలెం మండలం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ అనంతరం జిల్లా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారుగా 339కి పైగా అర్జీలు అందాయన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదని అందులో భాగంగా నియోజకవర్గంలో మూడోసారి ఈ కార్యక్రమాన్ని వలేటివారిపాలెం మండలంలో నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. నియోజకవర్గస్థాయిలో సమస్యలను పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. అందిన అర్జీలను మండల రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు ఆయా శాఖల జిల్లా అధికారులకు పంపడం జరిగిందని అర్జీదారుని ఇంటికి



వెళ్లి సమస్య గురించి అడిగి తెలుసుకొని దాని పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అజ్జిదారులతో మాట్లాడి సమస్య వివరాలను తెలుసుకోవడం జరుగుతుంది అని దానిని ఆయా శాఖల జిల్లా అధికారులు జిల్లా యంత్రాంగం తగిన పూర్తి పరిష్కారం చూపుతారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. శుక్రవారం సాయంత్రం సామీర్ పేట లో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి స్థానిక సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో మూడుసార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. శుక్రవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సుమారుగా 340 వరకు అర్జీలు అందాయని తెలిపారు. అందులో ఎక్కువగా రెవిన్యూ కి సంబంధించి 207 అర్జీలు అందాయని, 15 సచివాలయాలు 21 పంచాయతీలు ఉన్నాయని, అయితే వీఆర్వోల కొరత ఉందని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. నియోజకవర్గంలోని వెనుకబడిన కరువు మండలాలకు అన్ని రకాల ఆదుకోవాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయన జిల్లా కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్‌కలెక్టర్ హిమ వంశి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, బీసీ సంక్షేమశాఖ అధికారి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ▶ 4లో



## మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**రైతుల పట్ల, వ్యవసాయం పట్ల కూటమిది నిర్లక్ష్య వైఖరి**

**వైసిపి నిరసన దీక్షలో మాజీ రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి**

**విజయవంతంగా పొగాకు రైతుకు అండగా వైసిపి కార్యక్రమం**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 17)**

పొగాకును మద్దతు ధరకు కొనుగోలు చేసి పొగాకు రైతులను ఆదుకోవాలని పలువురు వైసీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద పొగాకు రైతులకు అండగా వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన దీక్షలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు రైతులకు మద్దతు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గిట్టుబాటు ధరల కోసం పొగాకు రైతులు గత కొద్దిరోజులుగా నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వం నుండి కనీస స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు, రైతుల ప్రయోజనాల కన్నా, వ్యవసాయం కన్నా తన స్వార్ధ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇస్తారని విమర్శించారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుల పంటల గిట్టుబాటు ధరల కోసం రూ.3000 కోట్లను ధరల స్థిరీకరణ నిధి కోసం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పొగాకుకు మద్దతు ధర తగ్గినప్పుడు మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించి, పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి నిధులు కేటాయించి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు ను కొనుగోలు 4

## శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి

**ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**

**పోలీసు సిబ్బంది సంక్షేమం, ఆరోగ్య సంరక్షణకు**

**అధిక ప్రాధాన్యత ఇస్తున్న జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**

**జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన పోలీస్ హాస్పిటల్ ప్రారంభం**




4

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 17)**

కిమ్స్ ఆసుపత్రి సహకారంతో జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన పోలీస్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, కిమ్స్ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. పోలీస్ ఆరోగ్య కేంద్రంలో రిసెప్షన్, మందులు పంపిణీ కేంద్రం (డ్రగ్స్ డిస్పెన్సరీ), ల్యాబొరేటరీ, వైద్యుల గదులు, నిపుణులైన వైద్యుల సేవల కోసం ప్రత్యేక గదులు, విశాలమైన

## రామాయపట్నంపై వైసీపీది దుష్ప్రచారం

**25 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పోర్టు నిర్మాణం**

**మీడియా సమావేశంలో**

**ఏపీ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య**

4



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూలై 17)**

రామాయపట్నం పోర్ట్ పై వైసిపి చేస్తున్నది దుష్ప్రచారమని ఏపీ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్య మాట్లాడుతూ రామాయపట్నం పోర్ట్ పై నీలి మీడియా నిరుద్యోగ యువత భయాందోళనకు గురి చేస్తూ దుష్ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజరాత్ తర్వాత అత్యధిక

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దామచర్ల కుటుంబ సభ్యులు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)**

తిరుమలలో శుక్రవారం ఉదయం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని కుటుంబ సమేతంగా ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి వారి వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో దామచర్ల సతీమణి దామచర్ల నాగ సత్యలత, కుమార్తెలు అనిషా లక్ష్మి, 4

## ఇస్రో శాస్త్రవేత్తల మూకుమ్మడి రాజీనామా

### దేశ ప్రతిష్టకు మాయని మచ్చ
### శాస్త్రవేత్తల రాజీనామాకు నైతిక బాధ్యతగా కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ రాజీనామా చేయాలి
### ఏపీసీసీ అధికార ప్రతినిధి షేక్ సైదా




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

ప్రతిష్టాత్మకమైన ఇస్రో శాస్త్రవేత్తల ముకుమ్మడి రాజీనామా భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థకు గొడ్డలి వేటు లాంటిదనీ, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇస్రో సంస్థకు ఇలాంటి దుస్థితి దాపరించడం పుష్కర కాలం పాటు దేశాన్ని పరిపాలిస్తున్న మోడీ ప్రభుత్వమే కారణమని ఏపిసిసి అధికార ప్రతినిధి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్‌గా పేరు గాంచిన స్వర్గీయ అబ్దుల్ కలాం నడియాడిన ఇస్రో సంస్థలో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. దేశ అంతరిక్ష పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాలకి తీవ్రమైన అవమానమని, శాస్త్ర సాంకేతిక రంగ అభివృద్ధికి పెద్ద ఎదురుదెబ్బన్నారు. శాస్త్రవేత్తలకు చాలీ, చాలని జీతాలతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న మోడీ అహంకార, నిరంకుశ, అసమర్థ, అవినీతి పాలన, ఇప్పటికే 120 మంది సీనియర్ శాస్త్రవేత్తలు , ఏ గ్రూప్ శాస్త్రవేత్తలు రాజీనామా చేయడం దేశ ప్రతిష్టకే మాయని మచ్చ. దేశ భద్రత, శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రైవేటీకరణ మూలంగానే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి ప్రధాని మోడీ ఎన్డీఏ కూటమి బాధ్యత వహించాలనీ సైదా అన్నారు. ఈ పరిణామాల పై కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ బాధ్యతా రహితంగా వ్యవహరిం చడం సమంజసం కాదని, ఇదంతా పాలన వ్యవహారమని ఎంతోమంది వస్తుంటారు పోతుంటారని నిర్లక్ష్యంగా మాట్లాడటం మంత్రికి తగదు. దేవుడి పేరుతో, దయ్యాల పేరుతో ఓట్లు అడిగి అధికారంలోకి వచ్చిన మూఢనమ్మకాలతో దేశ ప్రజలను మభ్యపెట్టే మోడీపాలనలో శాస్త్ర సాంకేతిక రంగంలో భారత దేశం అభివృద్ధి చెందుతున్నదని ఆశించడం మన మూర్ఖత్వమే అవుతుందని ఆయన అన్నారు. ఈ పరిణామాలకు నైతిక బాధ్యతగా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

## కోవిడ్ సన్నద్ధత పై జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

### సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో శుక్రవారం ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో అన్ని రకాల సన్నద్ధత చర్యలు చేపట్టినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణితో కలిసి ఆయన కోవిడ్ షెడ్లను పరిశీలించారు. కోవిడ్ అనుమానితులకు పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో రోగులను చేర్చేందుకు కోవిడ్ బెడ్లు పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు తెలిపారు. అదే విధంగా కోవిడ్ పరీక్షల కోసం ప్రత్యేక ఐసోలేటెడ్ క్యాబిన్‌ను కూడా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కోవిడ్ లక్షణాలు లేదా అనుమానిత లక్షణాలు ఉన్నవారు ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కోవిడ్ సన్నద్ధతలో భాగంగా అవసరమైన సిబ్బందిని వెంటనే కేటాయించాలని సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలతకు సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని సూచించారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సూచనల మేరకే చికిత్స పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ మాధవీలత, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, ఏఆర్ఎంఓ డాక్టర్ సునీల్ గవాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి








హాల్‌తో పాటు ఇతర అవసరమైన సౌకర్యాలను కల్పించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా అనుకూల వాతావరణంలో ఈ హాస్పటిల్ ను నిర్మించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యం పైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆరోగ్యవంతమైన పోలీసు సిబ్బందే ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించగలరని అన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య సేవలు పొందడం అవసరమన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. ఈ దిశగా కిమ్స్ ఆసుపత్రుల యాజమాన్యం అందించిన సహకారం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమం, ఆరోగ్య సంరక్షణకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నూతన పోలీస్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విధుల్లో సిబ్బంది మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా ఆరోగ్యం మహాభాగ్యమన్న ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. నూతన పోలీస్ హాస్పిటల్‌లో సాధారణ వైద్య సేవలతో పాటు ప్రాథమిక చికిత్స, క్రమానుగత ఆరోగ్య పరీక్షలు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ హాస్పిటల్ ద్వారా సిబ్బంది చిన్న చిన్న ఆరోగ్య సమస్యల కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, విధి నిర్వహణలో అంతరాయం లేకుండా మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం, వాకింగ్ చేయడంతో పాటు తమ ఆరోగ్యంతోపాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యవంతంగా, ఉత్సాహంగా విధులు నిర్వహించేందుకు అవసరమైన సంక్షేమ చర్యలను జిల్లా పోలీసు శాఖ నిరంతరం చేపడుతుందన్నారు. కిమ్స్ ఆస్పత్రుల చైర్మన్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో తాము కూడా భాగస్వాములము కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ హాస్పిటల్ కొరకు కృషి చేసిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ బొల్లినేని అద్విక్, డైరెక్టర్ టి గిరినాయుడు, ఆర్‌సిఓ ప్రవీణ్, కిమ్స్ ఒంగోలు సీఓఓ కె అంకిరెడ్డి, కిమ్స్ ప్రతినిధి శ్రీహరిరెడ్డి, పోలీస్ డాక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు సబ్ డివిజన్ సీఐలు విజయకృష్ణ, వెంకటేశ్వరరావు, శేషగిరిరావు, ప్రసాద్, హాజరత్తయ్య, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్ఐ వేణు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

చేయించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని రైతాంగాన్నే కాకుండా రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులను కూడా మోసం చేశారన్నారు. భూములకు బదులుగా అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని నమ్మ పలికిన చంద్రబాబు నాయుడు తన మాట నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాను అన్నారు. కుటుంబ అవసరాలు తీర్చుకోలేక, భూములను అమ్ముకోలేక, రాజధాని రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగానే రాజధాని రైతులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిశారన్నారు. ఇప్పుడు తిరిగి మరింత భూమి కావాలంటూ రైతుల నుండి లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రాజధానిని చంద్రబాబు నాయుడు బంగారు బాతుగా మార్చుకున్నారని, రైతులు ఇచ్చిన భూములను చౌక గా కార్పొరేట్ కు అప్పగిస్తూ, భారీగా ముడుపులు అందుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఏ పంటకు గిట్టుబాటు ధరలు లేవని, ఏ రైతు ఆనందంగా లేరు అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు వేలం నాటి నుండి రాష్ట్రంలో గిట్టుబాటు ధర లభించడం లేదని, దీంతో పొగాకు రైతులు అనేక రూపాలలో నిరసనలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు కనిపించడం లేదని ధ్వజమెత్తారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పొగాకు రైతులకు గిట్టుబాట్లు ధర కల్పించే విధంగా మార్క్ఫెడ్ ద్వారా పొగాకును కొనుగోలు చేయించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యోగా డే కోసం ఒక్క రోజుకు రూ. 500 కోట్లు ఖర్చు చేసిన రాష్ట్ర



ప్రభుత్వం, పొగాకు రైతుల గిట్టుబాటు ధరల కోసం నిధులు కేటాయించలేదా అని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నో బిడ్ లు లేకుండా క్వింటా రూ. 25 వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై రాష్ట్ర పొగాకు రైతాంగ శ్రమను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్ష అనంతరం చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దీక్షను విరమింప చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ రాష్ట్ర మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి అదేన్న, కుందూరు నాగార్జునరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జ్ చుండూరి రవిబాబు, వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.





## హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది







నాడు జగన్ వెలిగొండ పూర్తిగా కాకుండానే జాతికి అంకితం చేసి జిల్లా ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వెలిగొండ పనులు యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేస్తున్నామని మంత్రి తెలిపారు. త్వరలో వెలిగొండ నుంచి నీళ్లు అందించి ఈ ప్రాంతాన్ని అంతా సస్యశ్యామలం చేస్తామని మంత్రి స్వామి తెలిపారు.

## రామాయపట్నంపై వైసీపీది దుష్ప్రచారం

తీర ప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పోర్టు హాబ్ గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. 25 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పోర్టు నిర్మాణం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. పక్కా ప్రణాళికతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వ తీరుని చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ దుష్ప్రచాలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టు నిర్మాణం పై తప్పుడు ప్రచారం చేస్తున్న నీలి మీడియాపై కోర్టులో పరువు నష్టం దావా వేయనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. వైసిపి ఇలాగే దుష్ప్రచారాలకు పాల్పడితే వచ్చే ఎన్నికలలో 11 సీట్లు కూడా రావని హెచ్చరించారు. దామచర్ల కుటుంబం పై బురద చల్లాలని చూస్తే న్యాయపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

## పిజిఆర్ఎస్‌లో వచ్చే ప్రతి సమస్య పరిష్కరించడమే లక్ష్యం





## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దామచర్ల కుటుంబ సభ్యులు

తనూజ లక్ష్మిలు పాల్గొన్నారు. తొలుతశ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న దామచర్ల కుటుంబ సభ్యులకు దేవస్థానం అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరస్వామి, శ్రీ జ్ఞానప్రసూనాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, దేవస్థానం అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ఎం హరియాదవ్, ఏపీఆర్వో రవి, తదితరులు పాల్గొన్నారు.

## బద్వేల్ పట్టణ వాసికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

**విద్యార్థిని అభినందించిన**
**మానవతా అధ్యక్షులు నాగిరెడ్డి శంకర్‌రెడ్డి**
**నీట్ పరీక్షలో ఆల్ ఇండియా 42వ ర్యాంక్ సాధించిన**
**కరెంటు నరసారెడ్డి మనవడు మయుక్ జయసింహా**



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జులై 17)**
కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించాడు బద్వేల్ పట్టణానికి చెందిన ఒక యువకుడు. ప్రముఖ విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ కరెంటు నరసారెడ్డి మనవడు మయుక్ జయసింహా జాతీయ స్థాయి వైద్య విద్యా ప్రవేశ పరీక్ష (నీట్)లో ఆల్ ఇండియా 42వ ర్యాంకు సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు. బద్వేల్ మూలాలు ఉన్న ఈ కుటుంబానికి చెందిన యువకుడు జాతీయ స్థాయిలో ఇంతటి ఘన విజయం సాధించడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యుల కుటుంబంలో మరో ఆణిముత్యం....

తాతగారు సమాజానికి విద్యుత్ కాంతులు పంచే కాంట్రాక్టర్‌గా పేరుపొందితే, ఈ యువకుడి తల్లిదండ్రులు ఇద్దరూ బద్వేల్ పట్టణానికి చెందినవారై, ప్రస్తుతం హైదరాబాద్‌లో వైద్యులుగా స్థిరపడి నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తున్నారు. తల్లిదండ్రుల బాటలోనే నడిచి, వారి ఆశయాలను నిజం చేస్తూ ఈ యువకుడు దేశంలోనే అత్యుత్తమ ర్యాంకును కైవసం చేసుకోవడం విశేషం. క్రమశిక్షణ, నిరంతర శ్రమతో చదివిన ఈ యువకుడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది పోటీ పడిన పరీక్షలో 42వ ర్యాంకు సాధించి, బద్వేల్ పట్టణ కీర్తిని దశదిశలా వ్యాపింపజేశారు. ఈ సందర్భంగా విజేత మయుక్ జయసింహా మాట్లాడుతూ తాత ఆశీస్సులు, డాక్టర్లయిన తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వమే నన్ను ఈ స్థాయికి చేర్చాయి. భవిష్యత్తులో ఉత్తమ వైద్యుడిగా మారి సమాజానికి సేవ చేయడమే నా లక్ష్యం అని పేర్కొన్నారు. బద్వేల్ పట్టణ వాసి జాతీయ స్థాయిలో మెరవడం పట్ల మానవతా సంస్థ అధ్యక్షులు నాగిరెడ్డి శంకర్‌రెడ్డి, పారిశ్రామికవేత సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు, నాయకులు పలు కళాశాలల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ, ఆ యువకుడికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ అద్భుత విజయం పట్ల కరెంటు నరసారెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, విద్యుత్‌శాఖ వర్గాలు, వైద్య బృందాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల కీర్తిని జాతీయ స్థాయిలో నిలిపిన ఈ యువ వైద్య విద్యార్థి మయుక్ జయసింహా భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

## భార్యాభర్తలను కలిపిన శక్తి టీం



**(షణ్ముఖ వెలుగు, చీరాల, జులై 17)**
కుటుంబ కలహాలతో విజయవాడ నుంచి చీరాలకు వచ్చిన మహిళను గుర్తించి ఆమెను భర్తకు అప్పగించిన శక్తి టీం సభ్యులు మానవత్వం చాటారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మోయిన్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శక్తి టీంకు విజయవాడకు చెందిన ఏసోబు తన భార్య మేరీ కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. దీంతో చీరాల వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ సూచనలతో ఉమెన్ ఏఎస్ఐ శివకుమారి, కానిస్టేబుళ్లు సుబ్బారావు, సునీత కలిసి గాలించి రైల్వే ట్రాక్ సమీపంలో మేరీని గుర్తించారు. అనంతరం ఆమెను భర్తకు అప్పగించి ఇద్దరినీ విజయవాడ వెళ్లే రైలులో పంపించారు. శక్తి టీం సభ్యుల సేవలను దంపతులు అభినందించగా, సీఐ సోమశేఖర్ కూడా వారిని అభినందించారు.

## ప్రత్యేక అవసరాల చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించాలి



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 17)**
బాపట్ల జిల్లా రేపల్లె పట్టణంలోని భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు అందుతున్న విద్య, శిక్షణ, పునరావాస సేవలను పరిశీలించి వారి అభివృద్ధిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారుల తల్లులతో మాట్లాడి పిల్లల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, కేంద్రంలో ఉన్న వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, వారికి మరింత శ్రద్ధతో సేవలు అందించాలని సూచించారు. కేంద్రంలో చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన క్రీడా పరికరాలు ఏర్పాటు చేసి వసతులను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. సమాజం మొత్తం చేయి కలిపితే ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు మెరుగైన భవిష్యత్తు అందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి


**ఆర్డీవో కార్యాలయం దగ్గర మహాధర్నా**
**పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లకు పైగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి**
**ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి**
**పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలి**
**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ షరీఫ్**



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 17)**
రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దర్శి చెంచయ్యభవనం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా బయలుదేరి వందలాది మంది విద్యార్థులతో కలిసి ర్యాలీ ప్రదర్శన చేస్తూ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విద్యారంగ సమస్యల నిలయంగా మారిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీల విద్య వరకు అనేక సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయని, ప్రధానంగా సంక్షేమ వసతి గృహాలకు నిధులు కేటాయించక దశాబ్ద కాలంగా ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వార్డెన్ పోస్టులు భర్తీ కాకపోవడం వలన విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగి గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో డ్రాప్ అవుట్స్ పెరిగిపోతున్నాయన్నారు. డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ రాక సర్టిఫికెట్ చేతికి రాక కళాశాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రాష్ట్రంలో 6400 కోట్ల రూపాయలకు పైగా బకాయిలు పెండింగ్లో ఉండిపోవడం వలన దిక్కుతోచని స్థితిలో విద్యార్థులను నిట్టేసిన ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఆందోళన ద్వారా బుద్ధి చెప్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నికల్ ఐటిఐ. కళాశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్య అందుబాటులోకి తేవాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి ప్రభాకర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న ఈ రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలను గాలికి వదిలేసి నిధులు కేటాయించక పోగా విద్యార్థులు తక్కువ ఉన్నారని నెపంతో చాలా వరకు డిపార్ట్మెంట్లను క్లోజ్ చేస్తున్నారన్నారు. యూనివర్సిటీలలో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు మూడు వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని, పోస్టులు భర్తీ చేయకపోవడం వలన యూనివర్సిటీ విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతుందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత పీజీ చదువుకునే కలలుకంటున్న విద్యార్థులకు జీవో నెంబర్ 77 వలన వారికి ఫీజు రీయంబర్స్మెంట్ వర్తించకపోవడం చాలా వరకు పీజీ కళాశాలలు మూతపడడం వలన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నెంబర్ 77 రద్దు చేస్తానని చెప్పి ఇంతవరకు దాని ఊసే పట్టకపోవడం విద్యార్థులను మోసం చేయడమని మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలన్నీ పరిష్కారం చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి గులాం హుస్సేన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కళ్యాణ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు తాహీద్, గణేష్, జీవన్, ఇఫ్రోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# చీమకుర్తి హరిహర క్షేత్రంలో ఘనంగా ఆషాడ సారె వేడుకలు

**శాకాంబరీ దేవి అలంకారంతో దర్శనమిచ్చిన శ్రీ వాసవి అమ్మవారు, పార్వతి దేవి అమ్మవారు**
**వాసవి అమ్మవారికి, పార్వతి దేవి అమ్మవారికి గోరింటాకు, సారె సమర్పించిన శిద్దా లక్ష్మీ పద్మావతి**
**అమ్మవార్లకు ఆషాడ మొక్కులు, సారె సమర్పించిన మహిళా భక్తులు**



**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జులై 17)**
ఆశాడమాసం సందర్భంగా శుక్రవారం చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో జరిగిన గోరింటాకు పండగ, శాకాంబరీ అలంకారం, వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి, శిద్దా కుటుంబ సభ్యులు నేతృత్వంలో జరిగిన గోరింటాకు పండుగలో అమ్మవారి శాకాంబరీ అలంకార వేడుకలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మర్చిపోయిన మన హిందు పండగ సాంప్రదాయాలను నేటి తరాలకు గుర్తు చేస్తూ లక్ష్మీ పద్మావతి ఈ వేడుకలు వైభవంగా నిర్వహించి హిందు పండగ విశిష్టతను, సంప్రదాయాలను చాటి చెప్పారు. ఆషాడమాసం శుక్రవారం జరిగిన గోరింటాకు పండుగ, శాకాంబరీ అలంకారం, సందర్భంగా చీమకుర్తి, దర్శి, మార్కాపురం, ఒంగోలు, తదితర ప్రాంతల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం శ్రీ హరిహర క్షేత్రంలో వేంచేసివున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష కుంకుమ అర్చన విశేష పూల అలంకారాలు నిర్వహించారు. అనంతరం గోరింటాకుతో శ్రీ వాసవి అమ్మవారి అలంకరణ, శాకాంబరీ అలంకారంతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శాకాంబరీ దేవి అలంకారంతో శ్రీ వాసవి అమ్మవారు, పార్వతిదేవి అమ్మవారు నయన మనోహరంగా భక్తులకు దర్శన భాగ్యం కల్గించారు. ఆషాడ సారె వేడుకలు పునస్కరించుకొని చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శుక్రవారం జరిగిన శ్రీ వాసవి అమ్మవారి ఆషాడ గోరింటాకు పండగ, శాకాంబరీ అలంకార వేడుకలలో మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీ పద్మావతి దంపతులు క్షేత్రంలో వేంచేసి వున్న సర్వ దేవతలకు విశేష పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. వివిధ రకాల, కూరగాయలతో అమ్మవారికి ఇష్టకరమైన పదార్థాలతో పాటు శిద్దా లక్ష్మీ పద్మావతి, సువాసినిలతో కలసి గోరింటాకు స్వయంగా రుబ్బి అమ్మవారికి చీర, రవికే, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు 108 రకాల పదార్థాలు అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు పంచ మహా హారతులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వాసవి అమ్మవారి కీర్తనలతో చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో సాక్ష్యాత్తూ పెనుగొండ శ్రీ వాసవి అమ్మవారి క్షేత్రం తలపించింది. జై వాసవి నినాదంతో శ్రీ హరిహర క్షేత్రంలో భక్త జనసంద్రంగా మారింది. పల్లపోతు పద్మా ఆధ్వర్యంలో శ్రీ హరిహర క్షేత్రం కోలాటం బృందం నిర్వహించిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. విశేష పూజలు అనంతరం శ్రీమతి శిద్దా లక్ష్మీ పద్మావతి ముత్తైదువులకు పసుపు కుంకుమ, గాజులు, ప్రసాదాలు అందచేశారు. ఈ వేడుకలలో శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా పెద్దబాబు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సాయిబాబు దంపతులు, శిద్దా ప్రసాద్, శిద్దా బాలాజీ దంపతులు, శిద్దా జయశ్రీ, శిద్దా పుష్పాలత, శిద్దా జయభారతి, ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు సువర్ణ, పల్లపోతు పద్మ, అరుణ, ఆర్యవైశ్య వాసవి మహిళా సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిద్దా వెంకటేశ్వర్లు, శ్రీమతి వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాలు, ఉచిత బస్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు శ్రీమాన్ హరి వెంకట కుమారాచార్యులు, సుబ్రహ్మణ్యం శర్మ, హరికృష్ణ శర్మ, తదితరులు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.



## గ్రామీణ వైద్యులకు అండగా ఉంటాం

**జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం**
**నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇమాంసా, చంద్రశేఖర్**






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)**
గ్రామీణ వైద్యులకు ఎళ్ళవేళలా అండగా ఉంటామని ప్రకాశం జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ సయ్యద్ ఇమాంసా, పామిడిగంటం చంద్రశేఖర్‌లు అన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులలను కలుపుకుని అందరి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక**

ప్రకాశం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పామిడిగంటం చంద్రశేఖర్, కోశాధికారిగా డాక్టర్ తిరుమలశెట్టి రమేష్ బాబు, అలాగే డాక్టర్ నాగరాజు నూతన కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు సహకరించిన సీనియర్ డాక్టర్లకు, అలాగే ప్రతి మండల సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు కమిటీ సభ్యులు తెలియజేశారు. అలాగే ఈ కమిటీ జిల్లాలోని ప్రతి సభ్యుడిని కలుపుకొని మేమందరం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## మండవ మురళీకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పోతినేని శ్రీనివాసరావు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)**
ప్రముఖ పారిశ్రామికవేత్త, ఒంగోలు కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ జన్మదినం సందర్భంగా ఆయనకు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్) పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ సేవలో మురళీకృష్ణ అగ్రగామి అని పియస్ఆర్ అన్నారు. ఈ సందర్భంగా పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మండవ మురళీకృష్ణ వ్యాపార రంగంలోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. 'సూర్య శ్రీ ట్రస్ట్' ద్వారా ఆయన నిరుపేదలకు, అర్హులకు అనేక రకాల సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ఆపదలో ఉన్నామని తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆపన్నహస్తం అందిస్తూ, ప్రజల హృదయాల్లో మురళీకృష్ణ చెరపలేని ముద్ర వేసుకున్నారని ప్రశంసించారు. భవిష్యత్తులో ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు, ప్రముఖులు, అనుచరులు పాల్గొని మండవ మురళీకృష్ణకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన రోడ్డు ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, పామూరు, జులై 17)

నియోజకవర్గంలోని పామూరు పట్టణం నందు ఎండీఆర్ ప్లాన్ ద్వారా రూ.2.80 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మెయిన్ రోడ్డును శుక్రవారం ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు బీదా రవిచంద్ర, సహచర ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కాకర్ల సురేష్‌తో కలిసి కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడిన కారు



(షణ్ముఖ వెలుగు, సీఎస్‌పురం, జులై 17)

సీఎస్‌పురం పామూరు మార్గ మధ్యలో నేషనల్ హైవే 167 బి కోవిలంపాడు వద్ద కార్ యాక్సిడెంట్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో బోల్తా పడిన కారు ప్రమాదంలో కారు నడుపుతున్న డీజీపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంగళరెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు.

## కనిగిరిలో ఘనంగా దివ్యాంగులకు ఉచిత సహాయ పరికరాల పంపిణీ







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 17)

ఏఎల్ఐఎంసీవో సహకారంతో ఏడీఐపీ పథకం కింద అర్హులైన దివ్యాంగులకు శుక్రవారం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పరికరాలు అందజేసారు. దివ్యాంగులకు రూ.52,17,029 లక్షల విలువైన పరికరాల పంపిణీ చేసారు. ఎంపీ, ఎమ్మెల్యే, లబ్ధిదారులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్ళు, వీల్‌చైర్లు, వాకింగ్ స్టిక్స్ అందజేసారు. దృష్టి లోపం, వినికిడి లోపం గల విద్యార్థులకు టీఎల్ఎం కిట్లు, బ్రెయిల్ కిట్ల పంపిణీ చేసారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యమన్న ఎంపీ, ఎమ్మెల్యే తెలిపారు. సహాయ పరికరాలు అందుకోవడం పట్ల దివ్యాంగుల హర్షం, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల విదేక నాయకులు సుబ్బారెడ్డి, మైనర్ బాబు, శ్రీరామలక్ష్మి, నారపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వంతో తంగేళ్ళ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

(షణ్ముఖ వెలుగు, మద్దిపూడి, జులై 17)





మద్దిపూడి మండలం తంగేళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రముఖ సామాజికవేత్త మండలం మురళీకృష్ణ జన్మదిన సందర్భంగా ప్రవాస భారతీయ విద్యార్థి మానవ ప్రణయ్ ఏర్పాటుచేసి ప్లేట్లు క్లాసులు స్వీట్లు పంపిణీ చేశారు. శుక్రవారం గుండ్లకమ్మ సామాజిక సాహిత్య సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు,ఈసందర్భంగా పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎన్ సుధీర్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు మానవత సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు. మండవ మురళీకృష్ణ జన్మదినం సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ప్రవాస భారతీయ విద్యార్థి మండవ ప్రణయ్‌ని అభినందించారు. ప్రతి ఒక్కరు చిన్నతనం నుండే సేవా గుణాన్ని అలవర్చుకోవటం నిజమైన మానవ సేవ అన్నారు. మండవ మురళీకృష్ణ ఎంతో మంది దివ్యాంగ విద్యార్థులకు, ఆర్థికంగా చదువులకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు నిరుపేదలకు జీవనోపాధి నిమిత్తం సహాయం గొప్ప వ్యక్తి అన్నారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎన్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ గుండ్లకమ్మ సామాజిక సాహిత్య సేవా సమాఖ్య వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ కరాటే అకాడమీ ఫౌండర్ నల్లూరి మోహన్‌రావు, గుండ్లకమ్మ సామాజిక సాహిత్య సేవా సమాఖ్య అధ్యక్షుడు మండవ సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు జి భాస్కరరావు పి హనుమంతరావు, సుధాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



# డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఎం రమేష్ బాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఎం రమేష్ బాబు అన్నారు. జిల్లా కలెక్టర్ పి రాజబాబు ఆదేశాల ప్రకారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు డెంగ్యూ వ్యాధి, కీటక జనిత వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం రాజీవ్ గృహకల్ప నందు ఏర్పాటు చేసిన డెంగ్యూ వ్యతిరేక మా సోత్సవాల కార్యక్రమంలో జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఎం రమేష్ బాబు పాల్గొని మాట్లాడారు. ఈడిస్ దోమల ద్వారా డెంగ్యూ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందని, ఈ దోమలు పగలు మాత్రమే కుడతాయని అందువలన గృహములు వద్ద దోమలు అభివృద్ధి చెందే ప్రదేశాలను నీటి నిల్వలను శుభ్రం చేసి వాటి పై మూతలు పెట్టడం ద్వారా, పూల కుండీలు టైర్లు వంటి చోట్ల నీరు నిలవకుండా చేయడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా డెంగ్యూ వ్యాధి రాకుండా అరికట్టవచ్చునని పేర్కొన్నారు. డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కలిగించే నిమిత్తం ప్రతి శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రై డే కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధితో పాటు ఇతర కీటక జీవితం వ్యాధులైన మలేరియా తదితర వ్యాధులను నివారించవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొప్పోలు రొయ్యల చెరువు ఏరియా లో మన్యం నుంచి వచ్చిన రెండు మలేరియా కేసులను గుర్తించి వారికి రక్త పరీక్షలు నిర్వహించి మాస్ కాంటాక్ట్ రక్తపోతలను సేకరించి చికిత్స కార్యక్రమాలను చేపట్టారు. తదనంతరం ప్రజా చైతన్య నిమిత్తం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు పలు ప్రదేశాలలో ఆయిల్ బాల్స్, పలు కీటక అభివృద్ధి నిరోధక వ్యతిరేక చర్యలను చేపట్టడం జరిగింది. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ బి బాల బ్రహ్మ నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సాగర్, హెచ్‌వి నిర్మల జ్యోతి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్ నాయుడు, వై మధు, యలమందరెడ్డితో పాటు ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల పై ఉక్కుపాదం

ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు
పేకాట ఆడుతున్న స్థావరం పై
జరుగుమల్లి పోలీసులు దాడులు
ఏడుగురు అరెస్ట్
రూ.1,30,200 నగదు స్వాధీనం



(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 17)

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాల పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రకాశంజిల్లా జరుగుమల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందనవనం గ్రామ శివారులో రాత్రి సుమారు 10 గంటల సమయంలో పేకాట స్థావరం పై జరుగుమల్లి ఎస్ఐ భాగ్యరాజు వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 7 గురుని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.1,30,200 నగదు, 7 మొబైల్ ఫోన్లు ,7 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారి పై సంబంధిత చట్టాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నెంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

## శ్రీగిరిలో నూతన ఏఎస్పీ యుగంధర్ ప్రత్యేక పూజలు

### వేద ఆశీర్వచనం అందించిన వేద పండితులు అర్చకులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

ఒంగోలు నూతన అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఏఎస్పీ) అడ్మిన్ గా నియమితులైన యుగంధర్ శుక్రవారం ఒంగోలులోని శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. తొలుత శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఏఎస్పీ యుగంధర్ కు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలకడంతో పాటు సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# ఆర్య వైశ్య ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్‌గా సాదు వెంకటేశ్వర్లు నియామకం



(షణ్ముఖ వెలుగు, పోరుమామిళ్ల, జులై 17)

కడప జిల్లా ఆర్య వైశ్య ఉద్యోగుల సంఘంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పోరుమామిళ్లకు చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, ఆరోగ్యశాఖ ఉద్యోగి సాదు వెంకటేశ్వర్లు కడప జిల్లా ఆర్య వైశ్య ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్‌గా నియమితులయ్యారు. కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. నియామక పత్రాన్ని అందుకున్న సాదు వెంకటేశ్వర్లుకి ఆర్య వైశ్య సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, స్థానిక ప్రముఖుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోగ్య సేవతో పాటు సామాజిక ప్రస్థానం నిరంతర సేవకుడు: సాదు వెంకటేశ్వర్లు ఆరోగ్యశాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, మరోవైపు ఆర్య వైశ్య సంఘ సేవా కార్యక్రమాల్లో అత్యంత చురుకైన పాత్ర పోషిస్తున్నారు. విభిన్న సేవా కార్యక్రమాల ద్వారా కష్టాల్లో ఉన్న తోటి వారికి అండగా నిలవడంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారు.



**గుర్తింపు – గౌరవం :** ఉద్యోగ బాధ్యతలతో పాటు సమాజ హితం కోసం ఆయన చూపిస్తున్న నిరంతర కృషిని గుర్తించి, జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ ఆయనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా సాధు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించిన జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ యెలిశెట్టి గురు ప్రసాద్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నూతన జిల్లా చైర్మన్ సాదు వెంకటేశ్వర్లు నాయకత్వంలో ఆర్యవైశ్య ఉద్యోగుల సంక్షేమం, హక్కుల సాధనతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా మరింత ముమ్మరంగా సాగుతాయని సంఘ సభ్యులు, ప్రతినిధులు ధీమా వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి డి శ్రీనివాస్**




**(షణ్ముఖ వెలుగు, కారంచేడు, జులై 17)**

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి శ్రీనివాస్ పేర్కొన్నారు. కారంచేడు మండలం కుంకలమర్రు ఉన్నత పాఠశాలలో అమెరికాకు చెందిన ప్రవాస భారతీయులు రావి సుధాకర్ శ్రీకాంత్ సౌజన్యంతో ఇటీవల పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, క్రీడా పరికరాల గదులను చీరాల ఆర్డీవో ఎస్ నరసింహారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయుడు బొప్పూడి బాల ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. మరికొన్నిచోట్ల దాతలు ముందుకు వచ్చి విద్యాంజలి కార్యక్రమం ద్వారా అభివృద్ధిలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. కుంకలమర్రు పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో జిల్లా ర్యాంకు సాధిస్తే తాను వ్యక్తిగతంగా రూ. 25 వేల రూపాయలు అందించనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో పిల్లల సంఖ్యను పెంచితే గ్రామంలో వసంత గృహాన్ని సైతం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి గంగాధర్, తహసీల్దార్ మేడ మాధవి లత, ఎంపీడీవో నేతాజీ, ఎంఈఓ 1 సాంసన్, గ్రామ పెద్దలు రావిశేషయ్య, రావి ముత్తయ్య చౌదరి, బంగారు బాబు, ఎస్ఎంసి చైర్మన్ బషీర్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్ ఆవిష్కరణ




**(షణ్ముఖ వెలుగు, చీరాల, జులై 17)**

చీరాల మండలం రామకృష్ణాపురం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ బాబు 'జగన్ 2.0 సూపర్ యాప్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడంతో పాటు ప్రతి కార్యకర్త తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెల్లడించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. పార్టీతో నిరంతరం అనుసంధానంగా ఉండేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమాని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరి ఇప్పటికైనా నిజాలు చెప్పు

**రామయపట్నం పోర్టు ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలి**
**లేదంటే ఎంతటి పోరాటానికైనా వైసీపీ సిద్ధం**
**కలిసివచ్చే పార్టీలన్నిటిని ఈ ఉద్యమంలో కలుపుకుపోతాం**
**రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఛలో రామాయపట్నంను విజయవంతం చేయండి**
**వైసీపీ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్**



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 17)**

రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణ విషయంలో ఇంటూరి నాగేశ్వరరావు ఇప్పటికైనా నమ్మి ఓట్లు వేసిన కందుకూరు ప్రజలకు, భూములు ఇచ్చి పోర్టు నిర్మాణానికి సహకరించిన రైతన్నలకు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని నమ్మి మోసపోయిన నిరుద్యోగ యువతకు ఇప్పటికైనా నిజాలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్ట్ 2022లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసి 95% పూర్తి చేశారు.దాదాపు 850 ఎకరాలలో 3743 కోట్లతో పనులు ప్రారంభిస్తూ భూమి పూజ చేశారు.నాలుగు బెర్తులు నిర్మాణం ద్వారా 25 మిలియన్ టన్నుల కార్గో రవాణా సామర్థ్యంతో ప్రారంభించి రామయపట్నం పోర్టులో 70% ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చే విధంగా చట్టం చేశారు. పోర్ట్‌కి అనుసంధానంగా వచ్చే పరిశ్రమలు చుట్టుపక్కల ప్రాంతాల్లో వచ్చే అన్ని ప్రాజెక్టులలో స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తాం అని రామాయపట్నం పోర్టు పూర్తయి వినియోగంలోనికి వస్తే మత్స్యకార కుటుంబాలకు ఉద్యోగ ఉపాధితో పాటు అభివృద్ధి చెందుతాయనే లక్ష్యంతో రామాయపట్నం పోర్ట్‌లో ఎంత లేదన్న 4000 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి ఉద్యోగాలతో పాటు పారిశ్రామిక అభివృద్ధి జరిగి లక్షల్లో ఉద్యోగాలు వస్తాయి. పోర్టు నిర్మాణానికి సహకరించిన మొండివానిపాలెం, ఆవులవారి పాలెం, కర్లపాలెం, రావూరు, చేవూరు, సాలిపేట గ్రామాలను అభివృద్ధిలో భాగం చేస్తామనే సంకల్పంతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పించి 5000 కోట్ల రూపాయల విలువైన రామాయపట్నం పోర్టును చంద్రబాబు అత్యంత కారు చౌకగా 1500 కోట్లుకే ప్రైవేటు వ్యక్తులకు ధారాధత్వం చేస్తున్నారన్నారు. రామాయపట్నం పోర్టును ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ఏపీ మ్యారిటైమ్ బోర్డు బిడ్లును పిలిచిందన్నారు. ముందుగా బిడ్ల మొత్తంలో సగం అంటే 750 కోట్లు చెల్లిస్తే చాలు అంటుంది. మిగిలిన 750 కోట్లు వాణిజ్య కార్యకలాపాలు మొదలుపెట్టిన తర్వాత ఇస్తే సరిపోతుంది అని కూటమి ప్రభుత్వం అంటుంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ కృషితో ప్రభుత్వ రంగంలో సృష్టించిన లక్షల కోట్ల విలువైన ఆస్తుల్ని ప్రైవేటుకు తెగ నమ్ముతున్నారు. గత ప్రభుత్వం సమకూర్చిన విలువైన ఆస్తి రామాయపట్నం పోర్టు. ఇప్పటికైనా రామాయపట్నం పోర్టు వాస్తవాలు ప్రజలకు వివరించి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గిట్టుబాటు ధరల లేక అన్ని రకాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సంపద సృష్టి దేవుడేరుగు ఏమో కానీ వేల కోట్ల ఈ ప్రైవేటీకరణ ఉద్యమంలో కలిసివచ్చే పార్టీలన్నిటిని కలుపుకొని ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా పోరాడుతామని తెలిపారు. పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, జిల్లా సెక్రెటరీ తోకల కొండయ్య, రాష్ట్ర బూత్ జాయింట్ సెక్రెటరీ గణేశం గంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, జిల్లా ఇంటలెక్చువల్ అధ్యక్షులు రావులకొల్లు బ్రహ్మానందం, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు అనుమోలు లక్ష్మి నరసింహ, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, ఉలవపాడు మండల అధ్యక్షులు కాపులూరి కృష్ణ, లింగసముద్రం మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్‌రెడ్డి, నల్లమోతు చంద్రమౌళి, బద్దిపూడి జయరావు, వెలిచెర్ల ధన కోటేశ్వరరావు, పాలవల్లి అమర్నాథ్‌రెడ్డి, గెరా మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరు నియోజకవర్గ రైల్వే సమస్యలు పరిష్కరించండి

**ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి**

**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 17)**

మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ ప్రజల ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రైల్వే అధికారులను కోరారు. కంభం రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద చేపట్టిన ఆధునికీకరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మేనేజర్ సుదర్శనా సేన్ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గిద్దలూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక రైల్వే డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌కు గిద్దలూరులో హాల్ట్ కల్పించడం, రేణిగుంట–నంద్యాల రైలును గిద్దలూరు వరకు పొడిగించడం, గిద్దలూరు–గుంటూరు, గిద్దలూరు–నంద్యాల మధ్య కొత్త పగటి రైలు సర్వీసులు ప్రారంభించడం, తెనాలి–మార్కాపురం రోడ్ రైలును గిద్దలూరు లేదా నంద్యాల వరకు పొడిగించడం వంటి అంశాలను ప్రస్తావించారు. అలాగే గిద్దలూరు రైల్వే స్టేషన్‌లో కోచ్ పొజిషన్ డిస్‌ప్లే సిస్టమ్ ఏర్పాటు, ప్రయాణికుల కోసం చెల్లింపు వెయిటింగ్ రూమ్స్ నిర్మాణం, స్టేషన్ ఆధునికీకరణ పనులను వేగవంతం చేయడం, నల్లబండ బజార్–రాచర్ల రోడ్డులో మూసివేసిన రైల్వే గేటును తిరిగి ప్రారంభించడం, దిగువమెట్ట స్టేషన్‌లో ప్రతి రైలుకు తాగునీటి సౌకర్యం కల్పించడం, గిద్దలూరు మీదుగా చెన్నైకి కొత్త రైలు సర్వీస్ ప్రారంభించడం, కంభం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే అధికారులను కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడే ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించి, త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రైల్వే అధికారులను విజ్ఞప్తి చేశారు.







# అశోక్ యాదవ్‌కు సత్కారం



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 17)**

హైదరాబాద్ మహానగరంలోని నార్సింగి మాజీ సర్పంచ్ గ్రేటర్ హైదరాబాద్ యాదవ ప్రముఖుడు అశోక్ యాదవ్ మార్కాపురంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పిఎల్‌పి యాదవ్ ఇంటికి వచ్చిన శుభ సందర్భంలో శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సతీ సమేతంగా తన ఇంటికి వచ్చిన అశోక్ యాదవ్‌తో ఉన్నటువంటి చిరకాల పరిచయం దృష్ట్యా విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సన్మాన కార్యక్రమానికి యాదవ యువ న్యాయవాది పిన్నిక నాగార్జున ప్రసాద్ (పిఎన్‌పి) యాదవ్, మార్కాపురం జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం అధ్యక్షులు జోబు దానం, ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మాల సామాజిక వర్గం రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కవలకూరి అబ్రహం రాజ్ కుమార్, వైఎస్ఆర్సిపి మాల సామాజిక విభాగం రాష్ట్ర కమిటీ నాయకులు రమణలతో పాటు నాగం రామకృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్, బుర్రి బుల్లెట్ శ్రీనివాస్ యాదవ్, రిటైర్డ్ అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ యాదవ్, గుర్రం శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కొనసాగించాలి

**సుదీర్ఘకాలం పార్ట్ టైం ఉద్యోగులుగా కొనసాగిన వారిని అర్ధాంతరంగా తొలగించడం వారి భవిష్యత్తు పై, జీవించే హక్కు పై వేటువేయడమే**
**ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి**
**ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్**

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 17)**

రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థలలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న 1,440 మంది పార్ట్ టైం ఉపాధ్యాయులను పిజిటిలు, పీఈటీలు, నాన్ టీచింగ్ సిబ్బందిని అత్యంత దుర్మార్గంగా అర్ధాంతరంగా తొలగించే ప్రక్రియను మానుకోవాలని, వారిని కొనసాగించాలని ఐయఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఆర్ మోహన్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్ మోహన్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులు మమ్మల్ని అర్ధాంతరంగా తొలగించడం అన్యాయమని, తమను విధుల్లో కొనసాగించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యమిస్తున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకుండా వారి సమస్యల గురించి పట్టించుకోకుండా మౌనం వహించటం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాల నుంచి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఇప్పుడు మీ కాల పరిమితి తీరిపోయింది. మీరు వెళ్లిపోవాలని చెప్పటం ద్వారా వారి భవిష్యత్తు పై వేటు వేయడమే కాదు. వారి జీవించే హక్కు పైన కూడా దాడి చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత క్రూరంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు, అలాగే కొత్తగా నియమితులైన అభ్యర్థులు విధుల్లో చేరే వరకు అయిన, ప్రస్తుతం పని చేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులు, పీఈటీలు, నాన్ టీచింగ్ సిబ్బందిని కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని, వారికి భద్రత కల్పించాలని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

# నగర ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ ఉపయోగించుకోవాలి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)**

ఒంగోలు నగర ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ ఉపయోగించుకోవాలని నగరపాలక కమిషనర్ వెంకట కృష్ణయ్య కోరారు. చర్చి సెంటర్ లో టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2381 పై ప్లకార్డులు పట్టుకుని ప్రజలకు అవగాహన కలిగించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఆర్థికేతర సమస్యలు ఉన్న ప్రజలు నగర పాలక సంస్థ కార్యాలయం వరకు వచ్చి చెప్పుకోకుండా, ఇంటి వద్ద నుండే ఫోన్ ద్వారా చెప్పుకునేలా టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను 18004252381 కు ఫోన్ చేసి చెబితే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కారంచేడు స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి

**నీలం నాగేంద్రరావు**



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 17)**

కారంచేడు దళిత ఉద్యమం దేశవ్యాప్తంగా దళితుల ఆత్మగౌరవ పోరాటాలకు దిక్సూచిగా






నిలిచిందని, ఆ స్ఫూర్తితో రాజ్యాంగబద్ధంగా హక్కుల సాధన కోసం పోరాడాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు పిలుపునిచ్చారు. కారంచేడు దళిత మృతవీరుల 41వ స్మారక దినోత్సవం సందర్భంగా శుక్రవారం అద్దంకిలో మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి మృతవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు మాట్లాడుతూ 1985 కారంచేడు ఘటన దళిత ఉద్యమ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. దళితుల హక్కులు, సంక్షేమ పథకాల అమలు కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్యతో పాటు కాకుమాను రవి, పత్రా బంగారం, మేడికొండ మురళి, కోలా జీవరత్నం, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 17)

ప్రతి నెల మూడవ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు కనిగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం నుండి బొడ్డుచావిడి, ఆనంద నిలయం, గర్ల్స్ హై స్కూల్ వరకు ర్యాలీ, శ్రమదాన కార్యక్రమం ద్వారా పరిసరాలు శుభ్రం చేయించి, బల్క్ వేస్ట్ జనరేటర్స్ పై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించబడును. అనంతరం మొక్కలు నాటించడం జరుగుతుంది. కావున ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధులుగా జిల్లా కలెక్టర్, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ప్రజలు పాల్గొంటారని తెలిపారు.

## అమృత్ భారత్ స్టేషన్ పథకంలో కంభం రైల్వే స్టేషన్‌కు నూతన హంగులు

### ప్రధానమంత్రి మోదీ వర్చువల్‌గా ప్రారంభం









(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 17)

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద మార్కాపురం జిల్లా కంభం రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా పునరభివృద్ధి చేపట్టిన 75 రైల్వే స్టేషన్లతో పాటు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎంపికైన మూడు అమృత్ భారత్ స్టేషన్లలో కంభం రైల్వే స్టేషన్ ఒకటిగా నిలవడం విశేషం. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్టేషన్‌ను విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి అమృత్ భారత్ స్టేషన్ పథకానికి సంబంధించిన వివరాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా కంభం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, ఆధునిక వసతులు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అభివృద్ధి పనులతో కంభం రైల్వే స్టేషన్ మరింత ఆకర్షణీయంగా, ప్రయాణికులకు అనుకూలంగా మారనుందని పేర్కొన్నారు.

# అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పైకం పొందలేని రైతుల సమస్యకు పరిష్కారం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జులై 17)

జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇంకా రైతుల బ్యాంక్ ఖాతాలకు జమకాని రైతుల జాబితా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. నిజంపట్నం మండలం, ప్రజ్ఞమ గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించి పరిశీలించి అనంతరం సాంకేతిక కారణాలతో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పైకం పొందలేని రైతుల చెప్పిన సమస్యలు విన్నతర్వాత అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇంకా రైతుల బ్యాంక్ ఖాతాలకు జమకాని రైతుల జాబితా వెంటనే ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఆదేశించారు. ప్రజ్ఞమ్ గ్రామానికి చెందిన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం పైకం పడలేదని సమస్య ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని, అందులో భాగంగా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిణి, ఆర్డీఓ వచ్చి రైతులు చెప్పిన సమస్యను వినడం జరిగిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పైకం వారి బ్యాంకులో ఖాతాకు జమ కాకపోవడానికి గల కారణాలు వారి భూములకు సంబంధించి పట్టా ధర పాస్ పుస్తకంతో అనుసంధానం కాలేనందున, కొన్ని సాంకేతిక సమస్యలు వల్ల వారికి పైకం పడలేదని, టెక్నికల్ సమస్యకు సంబంధించి పరిశీలించి పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పుడే రాష్ట్రస్థాయి అధికారులతో ఫోన్ ద్వారా సమస్యను చర్చించడం జరిగిందని, త్వరలో వీరికి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పైకం అందేటట్లు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట రేపల్లె ఆర్‌డిఓ బి శ్రీదేవి, జిల్లా వ్యవసాయ అధికారిణి ఏ లక్ష్మి, తహశీల్దార్ ,గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు, తదితరులు ఉన్నారు.



## బాపట్ల జిల్లా ఖజానాధికారిగా పదోన్నతి పొందిన షేక్ కరీముల్లా



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 17)

పొదిలి ఉపకజానా కార్యాలయంలో పనిచేయుచున్న షేక్ కరీముల్లా బాపట్ల జిల్లా ఖజానాధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా పొదిలి ఎన్జీవో కార్యాలయంలో హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరిముల్లా బేగ్, ఎన్జీవో ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో షేక్ నాగూర్ వలి ఘనంగా సన్మానించారు.

# సత్యం హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ















(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 17)

చిన్నగంజాం సత్యం హైస్కూల్ కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఏపీజే అబ్దుల్ కలాం షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు నున్న హరనాథ్‌బాబు శుక్రవారం తెలిపారు. 2026 మార్చి 10వ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శేరు బాలనవ సుదర్శన్,పిట్టు శశి ప్రియ, ఆసోది జోత్స్న, కంపిరి రేఖ, కన్నా భవ్యసాయి, రాసూరి లీలా ప్రియ, గోపతోటి ఎకోలియలు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యానట్లు తెలియాజేసారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నున్న హరనాథ్ బాబు వివరాలు తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను రాష్ట్రస్థాయిలో మండలాల వారీగా ఎంపిక చేసి, జిల్లా కేంద్రాలలో ప్రతిభ పురస్కారాలను అందజేస్తారని ఈ అవార్డు కింద ఎంపికైన వారికి 20 వేల రూపాయల నగదు, బంగారు పతకం, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు. ఈ సంవత్సరం ప్రతిభా పురస్కారానికి ఎంపికైన వారు జూలై 20వ తారీఖున బాపట్లలోని వి కన్వెన్షన్ హాల్ నందు ప్రతిభ పురస్కారాలను జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా అందుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు నున్న హరనాథ్ బాబు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

## కంభం రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని ఎంఆర్‌పీఎస్ వినతి



(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 17)

కంభం రైల్వే స్టేషన్‌లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పనుగంటి షాలెం రాజ్ దక్షిణకోస్తా రైల్వే గుంటూరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో కంభం రైల్వే స్టేషన్‌పై సుమారు ఆరు మండలాల ప్రజలు ఆధారపడుతున్నారని తెలిపారు. కంభం, బెస్తవారిపేట, అర్ధవీడు, కొమరోలు, హనుమంతునిపాడు, కనిగిరి మండలాల ప్రజలు వైద్య చికిత్సలు, ఉద్యోగాలు, విద్య, వ్యాపార అవసరాల కోసం విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, విశాఖపట్నం, బెంగళూరు, ముంబై, గోవా, హుబ్లీ, ఢిల్లీ, చెన్నై తదితర ప్రాంతాలకు తరచూ ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం కంభం రైల్వే స్టేషన్‌లో కొద్ది రైళ్లకే స్టాపింగ్ ఉండడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదనంగా ప్రతి రైలులో జనరల్ బోగీల సంఖ్య పెంచడంతో పాటు గతంలో ఉన్న పార్సిల్ సర్వీసును పునరుద్ధరించాలని కూడా కోరారు. కంభం రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ కల్పించాల్సిన రైళ్లుగా 03251 బెంగుళూరు ఎక్స్‌ప్రెస్, 03252 దానాపూర్ ఎక్స్‌ప్రెస్, 22883 యశ్వంత్‌పూర్ గరీబ్ రథ్, 22884 పూరి గరీబ్ రథ్, 02811 యశ్వంత్‌పూర్ స్పెషల్, 02812 భువనేశ్వర్ స్పెషల్, 18063 యలహంక స్పెషల్, 18064 సంత్రాగచ్చి స్పెషల్, 22831 యశ్వంత్‌పూర్ స్పెషల్, 22832 హౌరా స్పెషల్, 08571 కటిహార్ స్పెషల్, 06572 యశ్వంత్‌పూర్ స్పెషల్, 17443 చర్లపల్లి ఎక్స్‌ప్రెస్, 17444 తిరుపతి స్పెషల్ రైళ్లను పేర్కొన్నారు. ఈ రైళ్లకు కంభం స్టేషన్‌లో స్టాపింగ్ మంజూరు చేసి ఈ ప్రాంత ప్రజల రవాణా సమస్యలను పరిష్కరించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పనుగంటి షాలెం రాజ్ రైల్వే అధికారులను కోరారు.

## ఎమ్మెల్యే ను కలిసి గుడ్లూరు సిఐ



(షణ్ముఖ వెలుగు, గుడ్లూరు, జులై 17)

గుడ్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డి రమేష్ శుక్రవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శుక్రవారం కందుకూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గుడ్లూరు సర్కిల్ పరిధిలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు.

## వీధి కుక్కల నియంత్రణ, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ పై అవగాహన సదస్సు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

వీధి కుక్కల నియంత్రణ, వాటి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ పై అవగాహన సదస్సును కమీషనర్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరపాలక సంస్థ కమీషనర్ ఛాంబర్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ టి వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణ కోసం ఇప్పటికే నగరపాలక సంస్థ లోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో గల దూకుడు స్వభావం కలిగిన వీధి కుక్కలు ఎక్కువ ఉన్నాయని, అవి సాధారణ పౌరులు, చిన్నపిల్ల మీద దాడి చేయటానికి వస్తున్నాయి. నగరపాలక సంస్థకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఈ దాడుల నివారణకు సంబంధించి నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలు గురించి జంతు ప్రేమికులకు వివరించారు. అలానే వారి నుంచి ఇచ్చే సూచనలు స్వీకరించటం జరిగింది. ఈ అవగాహన సదస్సులో ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ టి వెంకట కృష్ణయ్యతో పాటు పశుసంవర్ధక శాఖ ఏడి సురేంద్ర, ఎంహెచ్ఓ వైష్ణవి, ఇంచార్జ్ శానిటరీ సూపర్వైజర్ బాబ్జీ, శానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య , శానిటరీ ఇన్స్పెక్టర్లు కాట్రగడ్డ శ్రీనివాసరావు, జంతు ప్రేమికులు సికిందర్, అరుణ, విష్ణువర్ధన్, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## వేస్ట్ డంపింగ్ యార్డు తనిఖీ చేసిన కమిషనర్ టి వెంకట కృష్ణయ్య

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ టి వెంకట కృష్ణయ్య శుక్రవారం గుత్తికొండవారిపాలెంలో గల వేస్ట్ డంపింగ్ యార్డ్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ డంపింగ్ యార్డు నందు జరుగుతున్న లెగసీ వేస్ట్ బయో రెమిడియేషన్ పనులను గుత్తేదారులతో కలిసి పరీక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ వెంకట కృష్ణయ్య ఇప్పటివరకు ఎంత మేర లేగసీ వేస్ట్ ని తొలగించినది అలానే ఇంకా ఎంత మేరకు లేగసీ వేస్ట్ ప్రాసెస్ చేయవలసి ఉన్నది. ఆ మొత్తం ప్రాసెస్ చేయటానికి ఇంకా ఎంత సమయం పడుతోంది, మొదలగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కమీషనర్ మాట్లాడుతూ ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో లేగసీ వేస్ట్ ప్రాసెసింగ్ మొత్తం 4 ఫేస్లలో తరుణి అసోసియేట్స్ వారికి ఇవ్వడం జరిగింది అని, ఇప్పటికే ఫేస్ 1 కింద కేటాయించిన సుమారు 65,000, అలానే ఫేస్ 2 కింద కేటాయించిన 61,929 టన్నుల లేగసీ వేస్ట్ను ప్రాసెస్ చేయటం జరిగిందని, ఫేస్ 3 కింద కేటాయించిన సుమారు 75,000 టన్నుల లేగసీ వేస్ట్లో ఇప్పటికీ సుమారు 36,900 టన్నులు లేగసీ వేస్ట్ ప్రాసెస్ చేయటం జరిగిందన్నారు. ఫేస్ 4లో కేటాయించిన సుమారు 56,213 టన్నులు లేగసీ వేస్ట్ ప్రాసెసింగ్ స్టార్ట్ చేయటం జరిగిందని తెలిపారు. మొత్తంగా 2,58,142 టన్నుల లేగసీ వేస్ట్ గాను ఇప్పటివరకు 1,63,789 టన్నుల లేగసీ వేస్ట్ ను ప్రాసెస్ చేయటం జరిగినది అని తెలిపారు. ఇక మీదట చెత్త డంపింగ్ యార్డులు లేకుండా ఒంగోలు నగరంలో వచ్చే తడి మరి పొడి చెత్తను ప్రాసెస్ చేసేందుకు నిర్మిస్తున్న ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను కమీషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమీషనర్ టి వెంకట కృష్ణయ్యతో పాటు ఇంచార్జ్ ఏఈ రాంబాబు పాల్గొన్నారు.

## బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్ పై శిక్షణ




(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, జులై 17)

స్వయం సహాయక సంఘాల మహిళలకు వ్యాపార నైపుణ్యాలు, మార్కెటింగ్, లాభదాయకతను పెంచేందుకు బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్ శిక్షణను అందిచటం జరుగుతుందని ఎపిఎం అనురాధ తెలిపారు. స్థానిక ఇంకొల్లు మండల వెలుగు కార్యాలయం నందు ఎపిఎం అనురాధ అధ్వర్యంలో మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులకు బిజినెస్ డెవలప్మెంట్ ప్లాన్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం అనురాధ మాట్లాడుతూ స్వయ సంఘుల సభ్యులకు ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ప్రవర్తనలో మార్పు, ఆస్తుల సృష్టి, సామర్థ్యాల పెంపు సుస్థిర జీవనోపాదులు అనే ఎనిమిది అంశాలలో మార్పు తీసుకురావడమే బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ లక్ష్యాలను వివిధ శాఖల సమన్వయంతో పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు, మండల సమాఖ్య అకౌంటెంట్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు వారి బాల్యాన్ని భవిష్యత్తును నాశనం చేస్తాయి



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 17)

బాల్య వివాహాలు వారి బాల్యాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తాయిని చిన్న వయసులో బాల్య వివాహం చేసి వారి భవిష్యత్ ను నాశనం చేయవద్దని డాక్టర్ కే కీర్తి సరోజ్ కోరారు. శుక్రవారం సంతరావురు ఆరోగ్య కేంద్రం పరిధిలోని కడవకుదురు జేడ్పి హైస్కూల్ నందు డాక్టర్ కె కీర్తి సరోజ్ ఆద్వర్యంలో కౌమర బాలికల సమస్యలు, బాల్య వివాహలపై విద్యార్థునిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె కీర్తి సరోజ్ మాట్లాడుతూ బాలికలకు 14 నుంచి 18 ఏండ్ల మధ్య వయసు జీవితంలో అత్యంత కీలకం అని అన్నారు. అమ్మాయిల్లో శారీరకంగా, మానసికంగా, భావోద్వేగంగా ఈ దశ అత్యంత సంక్లిష్టమైనది అని అన్నారు. ఈ సమయంలో సరైన దారి చూపితే బాలిక సమాజానికి మార్గదర్శకురాలవుతుందన్నారు. కౌమార బాలికలు వయస్సులో బాల్య వివాహాలు, చదువును ఆపేయడం, రక్తహీనత, పోషకార లోపం, ఆరోగ్య సంబంధిత సమస్యలు ఎదుర్కొంటారని, ఈ వయస్సు బాలికకు అవకాశాలు కల్పించడమే నిజమైన బాలిక సాధికారత అని అన్నారు. అలాగే 14 సంవత్సరాల దాటినా బాలికలు హెచ్‌పివి వాక్సిన్ తీసుకోవాలని దినివల్ల గర్భశయ కాన్సర్ నుండి రక్షణ వుంటుదన్నారు. చివరిగా రూతు క్రమం వచ్చినప్పుడు బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో 104 డిఇఓ పొదిలి రాఘవ, సిహెచ్ఓ ఎస్ ఎమ్ రమ్య, కె స్మైలీ, ఎఎన్ఎంలు ఎం శారదా, ఎం కోటేశ్వరమ్మ, ఆశలు పాల్గొన్నారు.

# స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలు అందించేందుకు కృషి చేయాలి

### మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలి
### పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి
### ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్








(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 17)

స్మార్ట్ పోలీసింగ్ ఇండికేటర్స్ అయిన సిఈఐఆర్ ఈ-సాక్ష్య, సిసిటిఎన్ఎస్, ఈ-సమ్మన్స్, ఈ-ప్రాసిక్యూషన్స్ తదితర మాడ్యూల్స్ పై పట్టు పెంచుకుని ప్రజలకు మరింత సమర్ధవంతమైన సేవలు అందించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ కడప సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లా ఎస్పీ స్మార్ట్ పోలీసింగ్ మాడ్యూళ్ళపై సమీక్ష నిర్వహించారు. ఈ-ఆఫీస్‌ను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఎస్పీ ఆదేశించారు. రౌడీ షీటర్లు నేర ప్రవృత్తి మానుకోకపోతే వారి పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ట్రబుల్ మాంగర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికల పై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. గ్రామ సభలు, పల్లె నిద్ర, గ్రామాల సందర్శన తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్‌లో భాగంగా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి నిర్ణీత వ్యవధిలోగా చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, బహిరంగ మద్యపానం చేసే వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. స్కూళ్ళు, కాలేజీలలో 'మహిళా భద్రత' పై, సోషల్ మీడియా వల్ల కలిగే మహిళలు, బాలికల వేధింపులపై అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాల నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై నిఘా ఉంచాలని, వివిధ రకాలైన, వివిధ ప్రాంతాలలో జరిగే దొంగతనాలను మ్యాపింగ్ చేసి సదరు ప్రాంతాలలో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. గ్యాంబ్లింగ్, మట్కా, క్రికెట్ బెట్టింగ్ జరగకుండా కఠినంగా వ్యవహరించాలని, దాడులు ఉధృతం చేయాలని ఆదేశించారు. షాపులు, లాడ్జిలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, అపార్ట్ మెంట్లు తదితర జన సమ్మర్ధమైన ప్రదేశాల్లో ఏపీ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ మేరకు తప్పనిసరిగా సిసి కెమెరాలు అమర్చుకుని, వాటి పనితీరుపై శ్రద్ధ వహించేలా నిర్వాహకులకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై, హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు కారణాన్ని గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. వాహనాల రికార్డులు తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో కడప ఇంచార్జి డిఎస్పీ ఈ బాలస్వామిరెడ్డి, సబ్ డివిజన్‌లోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని తల్లి వినతి

### పుట్టుకతో మంచానికి పరిమితం అయిన పఠాన్ జాబిర్



(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 17)

మండల కేంద్రంలోని అరఫత్ నగర్‌కు చెందిన పఠాన్ ముబీనా తన కుమారుడు జాబిర్‌కు ప్రత్యేక వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జాబిర్ పుట్టుకతోనే శాశ్వత వికలాంగుడు కావడంతో మంచానికి పరిమితమై సాధారణ పిల్లల్లా నడవలేడు ,మాట్లాడలేడు అని రోజువారీ జీవనం కోసం కుటుంబ సభ్యులపైనే పూర్తిగా ఆధారపడుతున్నాడని ఆమె తెలిపారు. బాలుడికి నిరంతరం వైద్య చికిత్స, సంరక్షణ అవసరమవుతోందని, దీంతో కుటుంబంపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సాధారణ వికలాంగుల పింఛన్ రూ.6,000 మాత్రమే అందుతున్నప్పటికీ, పూర్తిగా మంచానికే పరిమితమై ఇతరుల సహాయం లేకుండా కదలలేని దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక పింఛన్ రూ.15,000 తన కుమారుడికి మంజూరు చేయాలని ఆమె కోరారు. జాబిర్ పరిస్థితిని పరిశీలించి అర్హత మేరకు రూ.15,000 ప్రత్యేక వికలాంగుల పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను విజ్ఞప్తి చేశారు.ఎన్నోసార్లు అధికారుల ద్వారా ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నానని ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదని కనీసం మీరు అయినా నేను ఇచ్చిన అర్జీ పరిశీలించి రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లాలని జాబిర్ తల్లి ఆవేదనతో మార్కాపురం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.



## ఎంటీఎస్ ఉపాధ్యాయుల జీతభత్యాల బిల్లులు వెంటనే ఎనేబుల్ చేయాలి

### డీఈఓకు ఎస్టీయూ వినతిపత్రం




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 17)

మార్కాపురం జిల్లాలో 2026 జూన్ నెలలో బదిలీ పై చేరిన ఎంటీఎస్ ఉపాధ్యాయుల జీతభత్యాల బిల్లులను నిధి యాప్‌లో సమర్పించేందుకు ఇప్పటికీ ఎనేబుల్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, సంబంధిత ఉపాధ్యాయులందరికీ నిధి యాప్‌లో బిల్లులు సమర్పించే విధంగా అత్యవసర చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావుకి ఎస్టీయూ నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. ఎర్రయ్య మాట్లాడుతూ, బదిలీపై విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు జీతభత్యాలు ఆలస్యం కావడం వల్ల వారు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే పై అధికారులతో సమన్వయం చేసి నిధి యాప్‌లో బిల్లులు సమర్పించే అవకాశాన్ని కల్పించి, జీతభత్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు సమస్యను పరిశీలించి, పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎస్ మార్కాపురం జిల్లా అధ్యక్షుడు వజ్రం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రామ కోటేశ్వరరావు, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సర్ 2.0 సూపర్ యాప్ ఆవిష్కరణ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

ఒంగోలు జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం జగన్ సర్ 2.0 సూపర్ యాప్‌ని ఒంగోలు పార్లమెంట్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, సంతనూతలపాడు అసెంబ్లీ ఇన్‌ఛార్జి మేరుగ నాగార్జున, గిద్దలూరు అసెంబ్లీ ఇంచార్జ్ కుందూరు నాగార్జునరెడ్డి, ఒంగోలు అసెంబ్లీ ఇంచార్జి చుండూరు రవిబాబు, పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కెవి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, మారెళ్ళ బంగారు బాబు, దుంపా రమణమ్మ, దుంపా చెంచిరెడ్డి, వేమా శ్రీను, పోలవరపు శ్రీమన్నారాయణ, వాకా వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చీరాలలో టీడీపీ విస్తృతస్థాయి సమావేశం





(షణ్ముఖ వెలుగు, చీరాల, జులై 17)

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జి రోజుకు కనీసం గంట సమయం పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాలని, ప్రజల్లో ప్రభుత్వ పనితీరును విస్తృతంగా వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, రాష్ట్ర యువ నాయకుడు మద్దులూరి గౌరీ అమర్నాథ్, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లలిత, మాజీ మున్సిపల్ చైర్మన్ మీంచాలా సాంబశివరావు, మాజీ వైస్‌చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు దిగుబర్తి సురేష్, పందిళ్లపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు పల్లప్రోలు శ్రీనివాసరావు, రైతు విభాగం అధ్యక్షుడు పోలకం శేఖర్, యువజన విభాగం అధ్యక్షుడు బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత




(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 17)

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఒక నెల, ఒక నియోజకవర్గం, నాలుగు పర్యటనల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గిద్దలూరు నియోజకవర్గం కంభం పట్టణంలోని ఉదయగిరి బృందావన ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, కలెక్టర్ విజయ సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, డీఎఫ్ఓ నిషా కుమారి, ఆర్‌డీఓ ఎం వెంకట శివరామిరెడ్డి, కంభం ఎస్‌డీసీ వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వయంగా స్వీకరించారు. ప్రజలు వినిపించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.